

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
మంగళవారం 9 డిసెంబరు 2025



హంద్రీ నీవా ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన పందికోన జలాశయం, కుడి ఎడమ కాలువలపై పదేళ్ల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. అసంపూర్తి పనులు పూర్తి చేస్తే 45 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అది సాకారం కావాలంటే రూ.210 కోట్లు ఇవ్వాలి. ఈ మేరకు ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. నిధులు ఇవ్వకపోగా రిజర్వాయరుకు, కాలువలకు వేర్వేరుగా రెండు ప్రతిపాదనలు పంపాలని ఉచిత సలహా ఇచ్చి ఫైలును వెనక్కి పంపినట్లు సమాచారం. అదే అనంతపురం జిల్లాలో హంద్రీ నీవా ప్రాజెక్టుకు అనుబంధంగా చేపట్టిన ఐదు ప్రాజెక్టులకు రూ.2,310 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమే. కరువు, వలసలతో తల్లడిల్లే కర్నూలు జిల్లాపై ఎందుకీ వివక్ష చూపడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు మేల్కొనాలి.. సీఎం చంద్రబాబు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అయినా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుపై ఒత్తిడి తెచ్చి నిధులు మంజూరు చేయించాలని రైతులు కోరుతున్నారు. నిధులిస్తే ఈ వేసవిలో పనులు చేసేందుకు అవకాశం ఉంది. ప్రతిపాదనలతో కాలయాపన చేయడం పలు విమర్శలకు తావిస్తోంది.



అసంపూర్తిగా జలాశయం

ఎందుకీ వివక్ష..



కప్పట్రాళ్ల సమీపంలో పత్తికొండ జలాశయం కుడి కాలువ దుస్థితి

- అసంపూర్తిగా పందికోన జలాశయం, కుడి, ఎడమ కాలువ
- రూ.210 కోట్లు ఇస్తే 45 వేల ఎకరాలకు సాగునీరు
- ప్రతిపాదనల ఫైలు వెనక్కి
- రెండుగా విడదీసి మళ్లీ ప్రతిపాదనలు తయారు చేయమని సూచన
- అనంతపురం జిల్లాకు ఐదు ప్రాజెక్టులకు రూ.2,310 కోట్లు
- కర్నూలు జిల్లాపై ఎందుకు నిర్లక్ష్యం
- ఏమాత్రం పట్టించుకోని జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు

కర్నూలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 8 టీఎంసీలు వాడుకొని నందికొట్కూరు, పాణ్యం, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలన్నది లక్ష్యం. 0.16 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన కృష్ణగిరి జలాశయం కింద 5.100 ఎకరాలు, 1.126 టీఎంసీల సామర్థ్యంతో పత్తికొండ (పందికోన) జలాశయం కుడి కాలువ కింద 10,774 ఎకరాలకు, ఎడమ కాలువ కింద 50,626 ఎకరాలు కలిపి 61,400 ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. పూర్తిస్థాయిలో నీళ్లు ఇస్తే పత్తికొండ, దేవనకొండ, ఆస్పరి మండలాలు పచ్చని పైర్లతో సస్యశ్యామలమవుతాయి. కరువు, వలసలు నివారించే అవకాశం ఉంది. అయితే జలాశయం, కుడి, ఎడమ ప్రధాన కాలువలు, పంట కాలువలు అసంపూర్తిగా వదిలేశారు. ఫలితంగా 16-18 వేల ఎకరాలకు కూడా సాగునీరు అందని దైన్యపరిస్థితి ఉంది. ఏళ్లు గడిచిపోతున్నాయి.. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్పా అసంపూర్తి పనులపై పాలకులు దృష్టి సారించడం లేదు. ప్రజాప్రతినిధులు కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టడంలో ఘోరంగా విఫలం అవుతున్నారు. ఫలితంగా కళ్ల ముందే కృష్ణా జలాలు తరలిపోతున్నా కరువు రైతులకు కన్నీళ్లు తప్పడం లేదు.

విడివిడిగా ప్రతిపాదనలు పంపండి..!

వైసీపీ హయాంలో రెండు మూడు పర్యాయాలు ప్రతిపాదనలు పంపినా నాటి జగన్ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని రూ.3,500 కోట్లతో రికార్డు స్థాయిలో హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పనులు పూర్తి చేశారు. పదేళ్లకు పైగా అసంపూర్తిగా వదిలేసిన పందికోన జలాశయం, కుడి, ఎడమ కాలువలు, పంట కాలువలు పూర్తి చేస్తే 45 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చని హంద్రీనీవా కాల్వ విస్తరణ పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి పత్తికొండకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి రైతులు, ఇంజనీర్లు తీసుకువెళ్లారు. తక్షణమే ప్రతిపాదనలు తయారు చేయమని ఆదేశించారు.

మిగతా 6వ పేజీలో



ప్రతికూల వార్తలపై స్పందించండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ వార్తాపత్రికలో వచ్చిన ప్రతికూల వార్తలపై శాఖల అధికారులు వేగంగా స్పందించి నివేదికను పంపించాలని కలెక్టర్ డాక్టర్ సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి సమస్యల వినతులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను మరింత సమర్థవంతంగా పరిష్కరించేందుకు నోడల్ అధికారులను నియమిస్తామన్నారు. రెవెన్యూ, సర్వే, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలకు సంబంధించిన అర్జీలు అత్యధికంగా వస్తున్నందున ఈ శాఖలు వేగవంతంగా స్పందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనూరాధ, కొండయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం: ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం నగరంలోని కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 119 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, సీఐలు శ్రీనివాస నాయక్, ఇబ్రహీం, శ్రీధర్ పాల్గొన్నారు.

వచ్చిన ఫిర్యాదులు

సర్వశిక్ష అభియాన్‌లో ప్రభుత్వ పథకం కింద ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇస్తామని చెప్పి రూ.లక్ష తీసుకుని గూడూరుకు చెందిన సుధాకర్ ఫేక్ ఆర్డర్ కాపీ ఇచ్చి రెండు నెలలు పని చేయించుకుని మోసం చేసినట్లు కర్నూలు శ్రీరామ్‌నగర్‌కు చెందిన అన్నమ్మ ఫిర్యాదు చేశారు. తనకు ఇద్దరు కుమారులు ఉన్నారని, ఇంటి నుంచి గెంటేశారని గూడూరు చెందిన అంజినమ్మ ఫిర్యాదు చేశారు. కర్నూలు ఆర్మీ ఎన్‌సీసీ క్యాంటీన్‌లో జూనియర్ అసిస్టెట్ ఉద్యోగం ఇప్పిస్తానని కర్నూలుకు చెందిన కాశీం వలి రూ.5 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు బాలాజీ నగర్‌కు చెందిన భారతి ఫిర్యాదు చేశారు. కర్నూలు వెంకాయపల్లె వద్ద ఉన్న 1.40 ఎకరాల మా భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు మిలిటరీ కాలనీకి చెందిన చంద్రమ్మ ఫిర్యాదు చేశారు. హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరిట కర్నూలుకు చెందిన బోజుగు కిశోర్ రూ.11.10లక్షలు తీసుకుని ఫేక్ లెటర్ ఇప్పించి మోసం చేశాడని హైదరాబాదుకు చెందిన దీప ఫిర్యాదు చేశారు. పవన్ రెసిడెన్సీ ఓనర్స్ వాట్సాప్ గ్రూపులో తనను అవమానిస్తూ మాట్లాడిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కర్నూలుకు చెందిన జ్ఞానేశ్వరగుప్తా ఫిర్యాదు చేశారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ

- అందరికీ అలంకార దర్శనాలు మాత్రమే
- ఈవో శ్రీనివాసరావు



కంపార్టుమెంట్‌లో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల మల్లన్నను దర్శించుకునేందుకు వస్తున్న యాత్రికులతో క్షేత్రమంతా రద్దీగా మారింది. వారాంతపు సెలవులు పూర్తయినప్పటికీ గర్భాలయ స్పర్శ దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు క్షేత్రానికి చేరుకుంటూనే ఉన్నారు. సోమవారం తెల్లవారుజామున తలనీలాలు సమర్పించుకుని కృష్ణమ్మ ఒడిలో నదీ స్నానాలు చేసి పసుపు కుంకుమలు గంగమ్మకు సారెలు సమర్పించుకున్నారు. భక్తులందరికీ అలంకార దర్శనమే ఉన్నందున వీఐపీ టికెట్లు పొందిన వారికి గంట సమయం, అతి శీఘ్ర దర్శనం వారికి రెండు గంటలు, శీఘ్ర, ఉచిత దర్శనం వారికి కూడా రెండు గంటలకు పైగా ఉభయ దేవాలయాలలో దర్శనాలు ముగిశాయని ఆలయ అధికారులు చెప్పారు. అదే విధంగా 500, 300 టిక్కెట్లు పొందిన భక్తుల ఉచిత లడ్డూ ప్రసాదాన్ని పొందున్నట్లు చెప్పారు. సాయంత్ర కళారాధన వేదికపై కడప తాళ్లపాక అన్నమయ్య జిల్లాకు చెందిన బాలరాజు, పాండురంగ రాజుల బృందం భజనలు చేసింది. హైదరాబాద్‌కు చెందిన కూచిపూడి కళాక్షేత్రం వారి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

బాలల సంక్షేమమే లక్ష్యం

- విద్యా ప్రమాణాలను పెంచుతున్నాం
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ



బాలసదరం విద్యార్థులతో మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాలల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పెద్దపాడులోని దామోదరం సంజీవయ్య బాలసదరాన్ని ఆమె సందర్శించారు. చిన్నారులు, వసతి గృహాల వార్డెన్లు చైర్‌పర్సన్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నివారణ అంశంపై విద్యార్థులు ప్రదర్శించిన నాటికను చైర్‌పర్సన్ శైలజ వీక్షించారు. వసతి గృహంలోని డైనింగ్ హాలు, వంటగది, స్టోర్ రూం విద్యార్థుల పడక గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలసదరంలో విద్యతో పాటు బాలల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి అవగాహన కల్పిస్తూ పిల్లలు బయటి ప్రపంచంలో ఎలా మెలగాలో అత్యవసర పరిస్థితుల్లో ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని పిల్లలు బాగా చదువుకోవాలన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ బాలసదరంలో 48 మంది పిల్లలు ఉన్నారని, వీరికి మెరుగైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. వీటిని కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. బాల్యవివాహాలు చేయకూడదని తల్లిదండ్రులకు, పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం నగరంలోని బీక్యాంపులో ఉన్న బీసీ బాలిక సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ డైరెక్టర్ రోహిణి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.విజయ పాల్గొన్నారు.

మంత్రాలయం మఠానికి పటిష్టమైన భద్రత

మంత్రాలయం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టినట్లు మంత్రాలయం సీఐ రామాంజులు, సెక్యూరిటీ సూపర్‌వైజర్ రాఘవేంద్రరెడ్డి తెలిపారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆదేశాల మేరకు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, సురేష్‌కోనాపూర్ ఆధ్వర్యంలో బెంగుళూరుకు చెందిన పూజ్యాయ సెక్యూరిటీ సర్వీసెస్ నుంచి 53 మందిని నూతనంగా నియమించారు. శ్రీమఠం ప్రాంగణం చుట్టూ ప్రధాన ద్వారాలు, క్యూలైన్లు వద్ద మూడు షిఫ్టులుగా ఉదయం 6 నుంచి 2 గంటల వరకు 22 మంది, రెండో షిఫ్టుగా మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు 21 మంది, మూడవ షిఫ్టుగా రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు 10 మంది ప్రకారం విధులు నిర్వహిస్తున్నారు. భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు, శ్రీమఠం భద్రత దృష్ట్యా కొత్తగా 53 మందిని నియమించడంతో పటిష్టమైన భద్రత చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.



సెక్యూరిటీ గార్డులతో సీఐ

కాపు, బీసీ భవనాల నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తా

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- కాపు భవన్ నిర్మాణానికి భూమిపూజ

7



బి.క్యాంపులో కాపు, బీసీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి టీజీ భరత్

వీఓఏ అవినీతి వెలుగులోకి...

- స్త్రీనిధి రుణాలు బ్యాంకులకు చెల్లించకుండా మోసం
- పోలీసులను ఆశ్రయించిన మహిళా సంఘాలు



ఆదోని వెలుగు కార్యాలయం

ఆదోని రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వయం స్వశక్తితో ఎదగాలని, కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిందుకు మహిళా సంఘాలు ఏర్పాటయ్యాయి. ఆయా సంఘాల్లోని సభ్యులకు బ్యాంకర్లు పావలా వడ్డీకే పొదుపు రుణాలతో పాటు స్త్రీశక్తి ద్వారా మరింత తక్కువతో ప్రభుత్వం రుణాలు కల్పిస్తోంది. ఈ సంఘాలను పర్యవేక్షించడానికి వెలుగు పేరుతో ఓ ప్రభుత్వ విభాగమే ఉంది. ఆయా సంఘాల కోసం పనిచేసే వీవోఏలు (విలేజ్ బుక్ కీపర్లు) మాత్రం అమాయక మహిళల నుంచి డబ్బులు కాజేస్తున్నారు. మహిళలు తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించే క్రమంలో బుక్ కీపర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. తాజాగా ఆదోని మండలంలో బుక్ కీపర్ల అవినీతి భాగోతం వెలుగులోకి వచ్చింది. ఆదోని మండలంలోని మాంత్రికి గ్రామంలో 40 పొదుపు గ్రూపు సంఘాలు ఉన్నాయి. ఒక్కో గ్రూపులో 10మంది మహిళలు ఉంటారు. పొదుపు సంఘాలకు వచ్చిన రుణాలను ప్రభుత్వం ఒక్కో గ్రూపునకు 20 లక్షల దాకా మంజూరు చేసింది. వీటికి అదనంగా స్త్రీ శక్తి ద్వారా ఒక్కో మహిళకు రూ.50వేలను కేటాయించింది. ఈ నిధులతో పొదుపు మహిళలు స్వతహాగా చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ ఆదాయాన్ని సమకూర్చుకుంటారు. ఆ వ్యాపారాల్లో వచ్చిన సొమ్మును విలేజ్ బుక్ కీపర్ ద్వారా బ్యాంకులకు రుణాల చెల్లింపు చేస్తున్నారు. ఈ క్రమంలో వైసీపీ నాయకుడిగా చెలామణి అవుతున్న నాగరాజు అలియాస్ నాగేశ్ అనే వీఓఏ మాత్రం 13 గ్రూపులకు చెందిన స్త్రీ నిధి డబ్బులు కాజేశాడు. ఇలా ఇప్పటి వరకు రూ.3.72 లక్షలు కాజేసినట్లు మహిళా సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు.



బుక్ కీపర్ నాగరాజు

పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్ ముట్టడి

తాము ఇచ్చిన డబ్బును బ్యాంకులో చెల్లించకుండా వీఓఏ నాగరాజు కాజేశాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని బాధిత పొదుపు సంఘాల మహిళలు పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ముట్టడించారు. వీఓఏ బ్యాంకులకు రుణాలు చెల్లించకపోవడంతో తిరిగి మాకు స్త్రీ నిధి ద్వారా నిధులు మంజూరు కాలేదని వాపోయారు. అతడిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. అనంతరం బుక్ కీపర్ నాగరాజుపై గ్రామ సమాఖ్య సంఘం అధ్యక్షురాలు వెంకటేశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొదుపు మహిళలకు అండగా వెలుగు ఏపీఎం కేసీ ఈరన్న, స్త్రీ నిధి ఆదోని డివిజన్ మేనేజర్ షేక్ అహ్మద్, వెలుగు సిబ్బంది ఉన్నారు. ఇదిలా ఉండగా మాంత్రికి గ్రామంలో మహిళలు డబ్బును కాజేసిన వీఓఏ నాగరాజును తొలగించినట్లు ఏపీఎం కేసీ వీరన్న తెలిపారు. బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్నామని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పెద్ద తుంబళం ఎస్ఐ మల్లికార్జున వెల్లడించారు.



పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మాంత్రికి గ్రామ పొదుపు మహిళలు







ఓపీ కౌంటర్ల వద్ద బారులుదీరిన రోగులు

ఓపీకతతో ఉండాల్సిందే..!

● కర్నూలు జీజీహెచ్‌లో రోగుల రద్దీ

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓపీ రోగులతో కిటకిటలాడింది. సోమవారం కావడంతో ఉదయం 10:30 గంటలకు ఓపీ కోసం వచ్చిన రోగులు రద్దీ పెరగడంతో పక్కన ఉన్న సీసీ రోడ్డుపైకి ఎక్కి క్యూలైన్లలో నిలబడ్డారు. సీజనల్ వ్యాధులు, చలి తీవ్రత పెరగడంతో సోమవారం రోజు వివిధ జబ్బులతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చారు. ఓపీ చీటి తీసుకునేందుకు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఓపీ రాసే సిబ్బంది ఆయుష్మాన్ భారత్ యాప్‌లో రోగి వివరాలు నమోదు చేసే వరకు ఓపికగా వేచి ఉండి తర్వాత ఓపీ కౌంటర్ల దగ్గరకు వెళ్లాల్సి వస్తోంది. సాధారణంగా ఓపీ కౌంటర్ల దగ్గర ఉదయం 10:30 గంటల నుంచి 11 గంటల వరకు విపరీతమైన రద్దీ ఉంటుంది. కానీ ఇటీవల చలి తీవ్రత పెరగడంతో ఓపీ రోగులు ఆలస్యంగా వస్తున్నారు. సోమవారం కూడా ఉదయం 11 గంటలకు రద్దీగా పెరిగి క్యూలైన్ సీసీ రోడ్డు వరకు కొనసాగింది. ఆసుపత్రిలో 12 ఓపీ కౌంటర్లు ఉండగా.. ఇందులో 6 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు పని చేస్తుండగా.. దీనికి సంబంధం లేని స్టాఫ్ నర్సులు ఓపీ కౌంటర్ల వద్ద పని చేస్తున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఓపీ చీటీలను త్వరగా ఇస్తున్న స్టాఫ్ నర్సులు కొంత ఆలస్యంగా ఇస్తున్నారు. అధికారులు కొత్తగా ఆలస్యంగా ఇస్తున్నారు. అధికారులు కొత్తగా డేటా ఎంట్రీ ఆపరేట్లను నియమించి ఓపీ దగ్గర రద్దీని నివారించాలని రోగులు కోరుతున్నారు.



ఓపీ కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిలిచివున్న మహిళలు

రాష్ట్ర క్రికెట్ జట్టులో కౌసల్యబాయికి చోటు

అండర్-19 విభాగంలో ఎంపికైన ఎల్.తండా యువతి



వెల్దుర్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రికెట్ రాష్ట్ర జట్టు అండర్-19కు వెల్దుర్తి మండలం ఎల్. తండా గ్రామానికి చెందిన సుగాలి వర్య కౌసల్యబాయి ఎంపికైంది. 13వ తేదీ నుంచి 21 తేదీల్లో అండర్-19 మహిళా విభాగంలో ముంబైలో జరగనున్న దేశవాళీ వన్డే మ్యాచ్‌లలో ఆడనున్నట్లు కోచ్‌లు శ్రీనివాసులు, శేఖర్ తెలిపారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోవిందరెడ్డి, సెక్రటరీ దేవేంద్రగౌడు, అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ రమేశ్‌బాబు శుభాకాంక్షలు తెలియజేశారు. తల్లిదండ్రులు సూర్యనాయక్, కాలెనాయక్, సోదరుడు డాక్టర్ శేఖర్‌నాయక్ సంతోషం వ్యక్తం చేశారు. స్వగ్రామమైన ఎల్.తండాలో గ్రామస్థులు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. దేశవాళీ మ్యాచ్‌లలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి భారత జట్టుకు ఎంపిక కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

లక్ష్మీనరసింహ స్వామి విగ్రహం సమర్పణ

ఆళ్లగడ్డ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాల్ స్వామికి అహోబలం మూవీ ప్రొడ్యూసర్ శెట్టి విజయ్‌కుమార్ లక్ష్మీనరసింహ స్వామి పంచలోహ విగ్రహాన్ని సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో అహోబలం పేరుతో సినిమా తీస్తున్నట్లు తెలిపారు.



లక్ష్మీనరసింహ స్వామి విగ్రహాన్ని అందిస్తున్న దాత

ముగిసిన వన్యప్రాణుల గణన

రేంజర్ ముర్తుజావలి



రుద్రవరం ఫారెస్టు రేంజ్ పరిధిలో వన్యప్రాణుల ట్రాన్సిట్ లైన్‌ను పరిశీలిస్తున్న రేంజర్ ముర్తుజావలి

రుద్రవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం ఫారెస్టు రేంజ్ పరిధిలో డిసెంబరు 1 నుంచి 8వతేదీ వరకు ట్రైల్ పాథ్ (మాంసాహార జంతువులు) ట్రాన్సిట్ లైన్ (శాకాహార జంతువులు)లను గణాంకాలు సోమవారంతో ముగించినట్లు రేంజర్ ముర్తుజావలి తెలిపారు. ట్రైల్‌పాథ్ 12 బీట్‌లలో 210 కి.మీ, ట్రాన్సిట్ లైన్ 14 బీట్‌లలో 84 కిమీ పూర్తి చేశామన్నారు. ట్రైల్ పాథ్ పరిధిలో పెంటికలు, పాదముద్రలు చెట్లను గీకిన గుర్తులను సేకరించామన్నారు. ట్రాన్సిట్ లైన్ శాఖాహార జంతువులను గుర్తించేందుకు ప్రతి బీట్ పరిధిలో మూడురోజుల నుంచి రెండు కిమీ చొప్పున కాలిబాటలు నడిచి పరిశీలించామన్నారు. వీటి పరిధిలో దుప్పి, అడవి పంది, కొండ గొర్రె, కణితి వంటి శాఖాహార జంతువుల పెంటికలను అటవీ సిబ్బంది నమోదు చేశారు. ట్రైల్‌పాథ్‌లో పెద్ద పులి, చిరుత, ఎలుగువంటి, రేసు కుక్క అడవి పిల్లి వంటి వాటి పెంటికలు పాదముద్రలు సేకరించామన్నారు. అలాగే అటవీ ప్రాంత సహజ ఆవాసంలో అంచనా వేయడానికి వృక్ష సంపదను, గట్టి ఔషధమొక్కను యాప్‌లో నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌చార్జి రేంజర్ ముక్తర్‌బాషా, సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాసరెడ్డి, రామక్రిష్ణ, బీట్ ఆఫీసర్లు సురేంద్రగౌడ్, నాగభూషణయ్య, జేమ్స్‌పాల్ పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

కర్నూలు అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని క్లస్టర్ వర్సిటీలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ జి.శ్రీనివాస్ తెలిపారు. త్రోప్స్ టెక్ కెరీర్ సొల్యూషన్స్ కంపెనీ నిర్వహించే ఇంటర్వ్యూల్లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ పోస్టులకు ఎంపిక చేస్తారని తెలిపారు. 2024-25 బీఎస్సీ కంప్యూటర్ సైన్సు పూర్తి చేసిన, 2026లో పాసౌట్ అయ్యే విద్యార్థులు అర్హులు అని తెలిపారు.

ఎందుకీ వివక్ష..

(5వ పేజీ తరువాయి)

రిజర్వాయరు అసంపూర్తి పనులకు రూ.60 కోట్లు, కాలువల అసంపూర్తి పనులకు రూ.150 కోట్లు చొప్పున రూ.210 కోట్లు ఇస్తే అదనంగా 45 వేల ఎకరాలు సాగులోకి వస్తుందని ప్రతిపాదనలు పంపించారు. నిధులు ఇవ్వకపోగా జలాశయానికి, కాలువలకు వేరువేరుగా రెండు ప్రతిపాదనలు తయారు చేసి పంపమని ఉచిత సలహా ఇస్తూ జలవనరుల శాఖ నుంచి ఫైలు వెనక్కి పడేశారు. నిధులు ఇవ్వకుండా కాలయాపన చేసేందుకే విడివిడిగా రెండు ప్రతిపాదనలు అంటూ మాయ చేస్తున్నట్లు అర్థమవుతోంది.



కరివేముల వద్ద రోడ్డు క్రాసింగ్ బ్రిడ్జి నిర్మించకపోవడంతో అడ్డంగా పైపులు వేసి నీటి మళ్లింపు

సరిహద్దు జిల్లాకు రూ.2,310 కోట్లు

సరిహద్దు ఉమ్మడి అనంతపురం జిల్లాలో హంద్రీనీవా ప్రాజెక్టుకు అనుబంధంగా ఉన్నా, 195 చెరువులకు హంద్రీనీవా జలాలు ఎత్తిపోసే ప్రాజెక్టుకు రూ.200 కోట్లు, రెండు టీఎంసీల సామర్థ్యంలో విస్తరించే జీడిపల్లి బండ జలాశయానికి రూ.650 కోట్లు, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి రెండు టీఎంసీలు ఎత్తిపోసే అప్పర్ పెన్నార్ ప్రాజెక్టుకు రూ.900 కోట్లు, జీడిపల్లి రిజర్వాయన్ నుంచి భైరవానితిప్ప(బీటీపీ) జలాశయానికి రెండు టీఎంసీలు ఎత్తిపోతల పథకానికి రూ.560 కోట్లు చొప్పున ఐదు ప్రాజెక్టులకు రూ.2,310 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ జిల్లా ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా జిల్లా అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు మంజూరు చేయించుకున్నారు. కానీ ఆ స్ఫూర్తి కర్నూలు జిల్లా ప్రతిప్రతినిధుల్లో లోపించినట్లు స్పష్టంగా తెలుస్తోంది. 45 వేల ఎకరాలను సాగులోకి తీసుకొచ్చే పందికోన జలాశయం, కాలువల అసంపూర్తి పనులకు నిధులు ఇవ్వకపోవడం జిల్లాపై పాలకుల వివక్షే కరణమా..? జిల్లా ప్రజా ప్రతినిధుల వైఫల్యమా..? అన్న ప్రశ్నలు తలెత్తున్నాయి. జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు స్పందించి నిధులు రాబట్టేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నేతలు ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని రాయలసీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు.

విడి విడిగా ప్రతిపాదనలు పంపమన్నారు

హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పందికోన జలాశయం, ఆ రిజర్వాయర్ కుడి, ఎడమ పంట కాలువల అసంపూర్తి పనులు పూర్తి చేస్తే 45 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చు. ఆ పనుల కోసం రూ.210 కోట్లు నిధులు అవసరం ఉందని ప్రతిపాదనలు తయారు చేశాం. ఒకే ప్రతిపాదన వద్దని రిజర్వాయరు, కాలువలకు విడివిడిగా రెండు ప్రతిపాదనలు తయారు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. ఆ మేరకు మళ్లీ ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతాం.

- నాగరాజు, సీఈ, హంద్రీ నీవా ప్రాజెక్టు, అనంతపురం

పొద్దెక్కినా వదలని చలి





రుద్రవరం మండంలోని కొండమాయపల్లెకు వెళ్లే దారిలో మంచు దుప్పటి



కొలిమిగుండ్ల: సూర్య కిరణాలు ప్రకాశించకుండా కమ్ముకున్న మంచు



చాగలమర్రిలో సూర్యుడు ఉదయించాక కూడా..



గోనెగండ్ల రోడ్లను కప్పేసిన మంచు

ఇటీవలి కాలంలో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత పెరిగింది. దీంతో ప్రధాన రహదారులపై పై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ కారణంగా ఆటోలు, ద్విచక్రవాహనదారులు సైతం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలుప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి ఉదయం 8:30 గంటల వరకు పొగమంచు కమ్మేసింది. పొద్దు పొడిచినా సూర్యుడు కనపడకుండా కప్పేస్తున్న పొగ మంచు వాహనదారులను భయపెడుతోంది. గోనెగండ్ల మండలంలో మంచులో వెళ్లడంతో రోడ్డు సరిగ్గా కనపడక ఓ ద్విచక్ర వాహనదారుడు అదుపు తప్పి గుంతలో పడి గాయాలపాలయ్యాడు. ఈ ఏడాది చలి తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు కూడా చెబుతున్నారు. ఇదిలా ఉంటే కొలిమిగుండ్ల మండలంలో సాగవుతున్న కంది, శనగ పంటలు పొగ మంచు కారణంగా పూత రాలిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- గోనెగండ్ల/కోసిగి/ కొలిమిగుండ్ల/ చాగలమర్రి/రుద్రవరం (ఆంధ్రజ్యోతి)

యువత హస్తకళలు నేర్చుకోవాలి

● వ్యవసాయ రంగం తర్వాత పెద్దరంగం హస్తకళలే

● రాష్ట్రపతి 'శిల్పగురు' పురస్కార గ్రహీత కె. శివప్రసాద రెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



కర్నూలు కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యువత హస్తకళల వైపు దృష్టి సారించి, నేర్చుకోవాలని సాఫ్ట్‌వేర్ రంగానికే పరిమితం కావద్దని యునెస్కో-సీసీఐ సీల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత, నంద్యాల జిల్లా బనగానపల్లెకు చెందిన కలంకారీ చిత్ర కళాకారుడు కె. శివప్రసాదర రెడ్డి అన్నారు. సోమవారం నుంచి జాతీయ హస్తకళల వారోత్సవాలు ప్రారంభమైన సందర్భంగా నగరంలోని లేపాక్షి ఎంపోరియంలో ఆయన్ను రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో కలిసిన 'ఆంధ్రజ్యోతి'తో ముఖాముఖీ మాట్లాడారు. ఆ విశేషాలు ఇవి....

ప్రశ్న : పద్మశ్రీ తప్ప హస్తకళారంగంలో ఎన్నో అవార్డులు సాధించేశారు. మీకు ఎలా అనిపిస్తోంది.

జవాబు : ఏదీ నేను ఆశించి ప్రయత్నించలేదు. ఏదైనా శ్రద్ధగా పనిచేయడమే లక్ష్యంగా ముందుకు పోయాను. అవకాశం ఉంటే పద్మశ్రీ పురస్కారం కూడా రావచ్చేమో.

ప్రశ్న : ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న చిన్న పల్లెటూరిలో పుట్టి, అంతర్జాతీయ స్థాయిలో కళాకారుడిగా ఎదిగారు. వెనక్కి తిరిగి చూసుకుంటే ఎలా ఉంది..?

జవాబు : నిజమే. ఎప్పుడో 46 ఏళ్ల క్రితం చిత్రకళను ప్రారంభించిన నేను ఈ స్థాయికి చేరుకుంటానని ఊహించలేదు. రైతు బిడ్డగా జన్మించిన నేను పది వరకు చదువుకొని, తర్వాత డ్రాయింగ్‌లో హయ్యర్ పూర్తిచేసి, తర్వాత డిగ్రీ పాసై, గొప్ప వ్యక్తుల వద్ద శిక్షణ తీసుకున్న తర్వాతే ఈ స్థాయికి చేరాను. విదేశాల్లో కూడా నా చిత్రకళా ఉత్పత్తులకు ఆదరణ లభించడం సంతోషంగా ఉంది. యునెస్కో అవార్డు 2002లో, అలాగే 2015లో భారతీయ హస్తకళల విభాగంలో జాతీయ స్థాయిలో అత్యున్నత పురస్కారంగా శిల్పగురు (మాస్టర్ ఆర్టిసన్) ప్రదానం చేస్తారు. భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో ప్రదానం చేసే ఈ పురస్కారం కింద రూ.2 లక్షలు నగదు, ప్రశంసాపత్రాన్ని భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోవడం సంతోషంగా ఉంది.

ప్రశ్న : కలంకారీ కళలో శిక్షణలు ఇస్తున్నారా..?

జవాబు : కొందరు నేర్చుకుంటున్నారు. అలాగే ఆన్‌లైన్‌లోనూ శిక్షణలు ఇస్తున్నాను. ఈ కళను కొనసాగించడానికి 'కళాక్షేత్ర'ను స్థాపించాను.

ప్రశ్న : మీరు సాధించిన రికార్డులు...?

జవాబు : ప్రపంచంలోనే అతిపెద్ద కలంకారీ పెయింటింగ్ 'భారత చిత్ర ఇతిహాసం' ఇది లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందింది. ఈ పెయింటింగ్ రామాయణం, భాగవతం, మహా భారతాలను వివరిస్తుంది. 47 అడుగులు వెడల్పు, 11 అడుగుల ఎత్తు ఉంటుంది. నా పెయింటింగ్‌లలో రామాయణ, భాగవతాలను తెలియజేసేది షంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పెట్టారు. అలాగే రామాయణానికి సంబంధించిన మరో పెయింటింగ్ ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏర్పాటు చేశారు.

ప్రశ్న : భారతీయ హస్తకళలకు ఆదరణ తగ్గిపోతోంది. ఇది నిజమేనా..?

జవాబు : అవును. మన దేశ సంస్కృతికి ప్రతిబింబాలుగా నిలిచేవి హస్తకళలు, చేనేత వస్త్రాలు. వీటిపై బాగా దెబ్బపడింది. పవర్‌లూమ్స్ వచ్చి, చేనేత కార్మికుల జీవితంపై పెద్ద దెబ్బతీశాయి. నేతన్నలు నేసే వస్త్రాలకూ, యంత్రాల్లో తయారయ్యే వస్త్రాలకూ ఎంతో వ్యత్యాసం ఉంటుంది. అలాగే హస్తకళాకారులు తయారు చేసే వాటికి యంత్రాలతో రూపొందించే వాటికి తేడా ఉంటుంది. ఒక చిత్రం నెలలు కష్టపడి ఒక కలంకారీ కళాకారుడు గీస్తాడు. కానీ కంప్యూటర్ ద్వారా దాన్ని కాపీ చేసి వేలాది చిత్రాలను మార్కెట్లో విడుదలై పోతాయి.

ప్రశ్న : హస్తకళలకు పూర్వవైభవం రావాలంటే ఏం చేయాలి..?

జవాబు : ఇది ప్రభుత్వాల బాధ్యత. నిధులు బాగా కేటాయించి, కళాకారుల ఉత్పత్తులకు ఆదరణ కల్పించాలి. యాంత్రిక శక్తిని తగ్గించి, కళాకారులకు శిక్షణలు, విక్రయ ప్రదర్శన కేంద్రాలు పెంచాలి. కేవలం వారోత్సవాలతో కాకుండా ఏడాది పొడవునా కార్యాచరణ కార్యక్రమాలు కొనసాగించాలి. ముఖ్యంగా యువతకు ఈ రంగంలోనూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు బాగా పెంపొందించాలి. సాఫ్ట్‌వేర్ రంగాలతో పోటీపడేలా చేనేత, హస్తకళా రంగంల్లోనూ అత్యాధునిక మార్పులతో అభివృద్ధి దిశగా నడిపించాలి.

8, 9 తేదీల్లో సాహిత్య సదస్సు

కర్నూలు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 21వ శతాబ్ది మహిళా సాహిత్యం సమాలోచనతో వచ్చేనెల 8,9 తేదీల్లో క్లస్టర్ వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ జి. శ్రీనివాస్ అన్నారు. సోమవారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఇందిరా శాంతితోపాటు ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు తెలుగు అధ్యయన శాఖ, తెలుగు పౌరసత్వ వైభవం, సాహితీ సంస్థ నిర్వహిస్తుందని తెలిపారు. సదస్సు కన్వీనరు వి. వింధ్యా వాసినీదేవి మాట్లాడుతూ 21వ శతాబ్ది మహిళల సాహిత్యంపైనే సదస్సు జరగడం ఇదే ప్రథమం అని దేశ, విదేశాల నుంచి ఎందరో అతిథులు హాజరవుతారని తెలిపారు. సాహిత్యాభిమానులు, ఆచార్యులు, అధ్యాపకులు ఈ సదస్సులో పాల్గొని పరిశోధన పత్రాలను సమర్పించాలని కోరారు. సదస్సు పత్రాలతో కూడి వ్యాస సంకలనాన్ని సదస్సు రోజున ఆవిష్కరిస్తామని తెలిపారు. పరిశోధకులు తమ వ్యాసాన్ని జనవరి 1లోపు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9705383422కు సంప్రదించాలని సూచించారు.

మేము ఇంతే...!

● వైట్ బోర్డు వాహనాలను వినియోగిస్తున్న అధికారులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఒక చిన్న అటెండర్ స్థాయి ఉద్యోగం కాదు.. వారు మండల, జిల్లా స్థాయి అధికారులే.. ప్రభుత్వ నియమ నిబంధనలను అమలుపరిచే అధికారులే దారి తప్పుతున్నారు. నియమ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తే.. అధికారులు మాత్రం మేము ఇంతే అనే ధోరణిలో వ్యవహరించడం కొసమెరుపు. సొంత అవసరాల వినియోగం కోసం తెల్లబోర్డు వాహనాన్ని మాత్రమే వినియోగించాలి కానీ వివిధ పనుల నిమిత్తం అధికార హోదాలో ఓనర్ కం డ్రైవర్ కలిగిన వాహనం మాత్రమే అధికారులు వినియోగించాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో అద్దె వాహనాలను వినియోగించాలి. అయితే అధికారులు సొంత వాహనాలను వినియోగించి ప్రభుత్వ సొమ్మును కాజేస్తున్నారు. వైట్ నెంబర్ ప్లేటు వాహనాలపై ఆన్ డ్యూటీ అని ప్రభుత్వ స్టిక్కర్‌తో అధికారికంగా విధులు నిర్వహిస్తున్నారు. కొందరు అధికారులు తమ పీసీలు, అటెండర్లను కారు డ్రైవర్లుగా వినియోగించుకుంటున్నారు. అధికారులు సొంత వాహనాలను వినియోగించుకుని బిల్లులు పెట్టి జిల్లా ట్రెజరీ అధికారులకు కళ్లు కప్పి నిధులను స్వాహా చేస్తున్నా కూడా ఉన్నతాధికారులు కూడా ప్రశ్నించకపోవడం గమనార్హం. ఎల్లో బోర్డుతో బ్యాంకు రుణాలు తీసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ డ్రైవర్ కం డ్రైవర్స్ రుణాలు చెల్లించకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎల్లోబోర్డు కలిగి డ్రైవర్స్ కం ఓనర్ వాహనాలకు మాత్రమే అనుమతించాలని వారు కోరుతున్నారు.







ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

కొత్తపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎదురుపాడు గ్రామంలో ఆత్మహత్యాయత్నం చేసిన తేనె శివశంకర్ (35) చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. గ్రామానికి చెందిన శివశంకర్ తన అన్నదమ్ముల ఆస్తి పంపకాల వివాదంలో తలెత్తిన వివాదం ఫలితంగా భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో శివశంకర్ ఈ నెల 6వ తేదీ రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పంటలకు క్రిమిసంహారక మందు తాగాడు. అపస్మారక స్థితికి వెళ్లిన శివశంకర్‌ను కుటుంబ సభ్యులు ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు కర్నూలులోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. మృతుని తల్లి భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రవీంద్రబాబు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..



సురేంద్ర (ఫైల్)

బనగానపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన సురేంద్ర (44) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య సోమవారం తెలిపిన వివరాలివీ.. సురేంద్ర తన ఇంట్లో ఉదయం 10 గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మీటరు దగ్గరకు ఫ్యూజ్ పోయిందని గుర్తించి సరిచేయడానికి ప్రయత్నిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు పలుకూరు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని ఎస్ఐ తెలిపారు. సురేంద్ర భార్య సంధ్యాసుధ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సురేంద్రకు భార్యతో పాటు కూతురు ఉంది.

వృద్ధుడి ఆత్మహత్య

పాములపాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్ణానగర్ గ్రామానికి చెందిన మాదాసు బాలయ్య (60) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పాములపాడు ఎస్ఐ సురేశ్‌బాబు తెలిపిన వివరాలు.. క్రిష్ణానగర్‌కు చెందిన బాలయ్య తాగుడుకు బానిసై తిరుగుతుండే వాడు. మద్యం తాగడం మానుకోవాలని ఇంట్లో వారు మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. బాలయ్య భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కాలువలో దూకిన వృద్ధురాలు

- కాపాడిన మత్స్యకారులు
- కుమారుడి ఆత్మహత్యతో మనస్తాపం

పాములపాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఒక్కగానొక్క కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడన్న మనస్తాపంతో ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకోవాలని ఎస్ఆర్ఎంసీ కాలువలో దూకింది. దీన్ని గమనించిన మత్స్యకారులు ఆ వృద్ధురాలిని కాపాడారు. పాములపాడు పోలీసులు తెలిపిన వివరాలివీ.. జూపాడుబంగ్లాకు చెందిన ఏసమ్మ మూడు రోజుల క్రితం గుత్తికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఆమె కుమారుడు ఉరి వేసుకున్నాడు. దీంతో ఆమె మనస్తాపానికి గురైంది. ఆత్మకూరుకు బస్సులో వెళ్తూ పాములపాడు మండలం కంబాలపల్లి గ్రామంలో దిగి శివారులోని ఎస్ఆర్ఎంసీ కాలువలో దూకింది. దీంతో అటువైపుగా వెళ్తున్న వారు కేకలు వేయడంతో కాలువలో చేపలు పడుతున్న మత్స్యకారులు వృద్ధురాలిని కాపాడి ఎస్ఐ సురేశ్‌బాబుకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఆమె బంధువులను పిలిపించి వారికి అప్పగించారు.

రైల్వే ఉద్యోగికి రెండేళ్ల జైలు, జరిమానా

కర్నూలు లీగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బిల్లు మొత్తం ప్రాసిసింగ్ చేయడానికి లంచం డిమాండ్ చేసిన రైల్వే ఉద్యోగికి రెండేళ్ల కారాగార శిక్షతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ కర్నూలు సీబీఐ కోర్టు న్యాయాధికారి ఎం.శోభారాణి సోమవారం తీర్పు చెప్పారు. సీబీఐ కథనం మేరకు.. గుంతకల్లులోని దక్షిణ మధ్య రైల్వేలో కాంట్రాక్టు పనులను ఫిర్యాది కాంట్రాక్టర్ రాజుల నాయుడు రూ.30 లక్షల మేరకు పూర్తి చేశారు. అయితే ఆ కాంట్రాక్టు మొత్తం రాకపోవడంతో అకౌంట్స్ అసిస్టెంట్ అయిన చల్లా శ్రీనివాసులు రూ.15వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టర్ సీబీఐ అధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు 2017 నవంబరు 20వ తేదీన రాజుల నాయుడు నుంచి శ్రీనివాసులు రూ.15వేలు లంచం తీసుకుంటుండగా.. సీబీఐ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈ మేరకు సీబీఐ అధికారులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో రెండేళ్ల కారాగార శిక్ష, రూ.20వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున ఎస్.మనోహర్ వాదించారు.

ట్రావెల్ బస్సుకు భారీ జరిమానా

డోన్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజోతి): బీహార్‌కు చెందిన ట్రావెల్ బస్సుకు డోన్ ఆర్టీవో అధికారులు భారీ జరిమానా విధించారు. అనంతపురం నుంచి హైదరాబాదుకు ఏడుగురు ప్రయాణికులతో వెళ్తున్న ట్రావెల్ బస్సును హైవే పై ఆర్టీవో క్రాంతి కుమార్ ట్రావెల్ బస్సును ఆపి తనిఖీ చేసే ప్రయత్నం చేయగా.. డ్రైవర్ ఆపకుండా పారిపోయేందుకు ప్రయత్నించాడు. బస్సును వెంబడించి డోన్ మండలం జగదుర్తి గ్రామ సమీపంలో హైవే రోడ్డుపై బస్సుకు అడ్డంగా నిలిపి తనిఖీ చేయగా.. రోడ్డు ట్యాక్స్ లేదని గుర్తించి రూ.4.91 లక్షల జరిమానా విధించినట్లు ఆర్టీవో తెలిపారు.

కూలీల ఆటో బోల్తా..

కోసిగి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తి పనులకు వెళ్తున్న కూలీల ఆటో సోమవారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కౌతాళం మండలం కరిణి గ్రామానికి చెందిన ఎల్లమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడిందని కోసిగి ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు. కౌతాళం మండలంలోని కరిణి గ్రామానికి చెందిన మహిళా కూలీలు అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మహేంద్ర ఆటోలో మాధవరం గ్రామానికి పత్తి కూలీ కోసం బయలుదేరారు. అయితే కొద్దిసేపటికే వందగల్లు గ్రామ సమీపంలో ఎదురెదురుగా రెండు ఆటోలు తప్పించే ప్రయత్నంలో బోల్తా పడింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో 11 మందికి గాయాలు

- పత్తికొండ, మద్దికెరలో ఘటనలు

పత్తికొండ టౌన్/మద్దికెర, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పత్తికొండ, మద్దికెరలో సోమవారం కుక్కలు దాడి చేయడంతో 11 మంది గాయపడ్డారు. వివరాలివీ.. పత్తికొండ పట్టణంలో రాత్రి ఓ కుక్క దాడి చేయడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. పట్టణంలోని గుండప్ప హోటల్ సమీపంలో అటుగా వెళ్తున్న గోవిందు, శ్యామ్‌కుమార్, చిన్నారి వెంకట్‌ను కుక్క కరిచింది. అలాగే మరో ఇద్దరిని కూడా ఆ కుక్క కరిచి గాయపరిచింది. గాయపడిన వారంతా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నారు.

మద్దికెర గ్రామంలోని ఆయా ప్రాంతాల్లో సోమవారం వీధి కుక్కలు ఆరుగురిపై దాడి చేసి కరిచాయి. దీంతో బాధితులు ఇంజెక్షన్లు వేయించుకోవడానికి స్థానిక ఆసుపత్రికి వచ్చారు. బాధితులు మాట్లాడుతూ గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, ప్రజలపై ఎక్కడ పడితే అక్కడ దాడులు చేస్తున్నాయని అన్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కలను బయటకు తరలించాలని కోరుతున్నారు. ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి మాట్లాడుతూ వైద్యశాలలో కుక్క కరిచిన వారికి యాంటి రేబీస్ నివారణ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని, కుక్కకాటుకు గురైన వారికి వేస్తున్నామని తెలిపారు.

తడకనపల్లె రోల్ మోడల్

- ఇక రాష్ట్రమంతటా పశువుల హాస్టళ్లు
- ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గానికి ఒక పశు హాస్టల్
- స్థలాల కోసం ప్రతిపాదనలు పంపాం : జేడీ హేమంత్ కుమార్



కల్లూరు మండలం తడకనపల్లెలో పశువుల హాస్టల్

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసి వారిని లాభాలబాట పట్టించేందుకు వినూత్న పథకాలను అమలు చేస్తున్నది. రైతు లాభాల బాట పట్టాలంటే కేవలం వ్యవసాయం మాత్రమే సరిపోదని, ప్రత్యామ్నాయ మార్గాలను చూపాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా పాడి పరిశ్రమను కొత్త పుంతలు తొక్కించేందుకు చర్యలు చేపట్టింది. మూగ జీవాలకు నీడ కల్పించందుకు హాస్టళ్ల ఏర్పాటుకు సిద్ధమైంది. దశాబ్దం కిందటే కర్నూలు జిల్లా కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో పాడిగేదెలకు హాస్టల్ నిర్వహణ పథకానికి బీజం వేయడంతో ఆ పథకాన్ని పొదుపులక్ష్మి గ్రూపుల మహిళలు దిగ్విజయంగా నడిపిస్తున్నారు. ఈ పథకానికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నియోజకవర్గంలో తడకనపల్లెలో మాదిరి పాడిగేదెలకు హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా ఈ హాస్టల్ ఏర్పాటు కోసం విధి విధానాలను రూపొందించి వెంటనే ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలంటూ పశుసంవర్ధక శాఖ కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఇందులో భాగంగా పశుసంవర్ధక శాఖ కమిషనరేట్ నుంచి జిల్లా కేంద్రంలోని పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఒక్కో హాస్టల్‌కు రూ.10 లక్షలు..

పాడి పరిశ్రమ అభివృద్ధికి గత టీడీపీ పాలనలో మెగా గోకులాల పేరిట షెడ్లు నిర్మించి రైతులకు చేయూత అందించారు. ఆ తర్వాత ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణను పట్టించుకోలేదు. మళ్లీ కూటమి ప్రభుత్వం అన్ని నియోజకవర్గాల్లో పశువులకు వసతి గృహాలు నిర్మించడానికి నిర్ణయం తీసుకున్నారు.

పశువుల సంరక్షణ, పోషణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10 లక్షల దాకా కేటాయించనున్నారు. ఒక్కో హాస్టల్‌లో 20 నుంచి 30 పశువులకు వసతి కల్పించనున్నారు. పాడిగేదెలకు అవసరమైన పశుగ్రాసాన్ని సమకూర్చడంతో పాటు వాటికి తాగునీరు, పాలు పితికేందుకు, పశుగ్రాసాన్ని చిన్న చిన్న ముక్కలు చేసేందుకు యంత్రాలను హాస్టల్‌లో ఏర్పాటు చేయనున్నారు. గేదెల పేడ నుంచి బయోగ్యాస్, సేంద్రియ ఎరువుల తయారీ పాల ఉత్పత్తితో రైతులకు ఆదాయం పెంచాలనే లక్ష్యంగా ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. ఈపశు హాస్టళ్ల నిర్వహణను పొదుపు లక్ష్మి గ్రూపు మహిళలకు, రైతుల సంఘాలకు అప్పగిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయట వెళ్లిన రైతుల పశువులకు, పట్టణాల్లోని బహిరంగ ప్రదేశాల్లో తిరుగుతున్న పశువులకు హాస్టల్ ఏర్పాటు చేస్తారు. పశువులను రక్షించడానికి, అదే విధంగా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి ఈ పశు హాస్టల్స్ ఎంతో ఉపయోగపడుతాయని అధికారులు తెలిపారు.

ఉపాధి హామీ నిధులతో పశువులకు హాస్టళ్లు

జిల్లా నీటి యాజమాన్య సంస్థ నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల హాస్టళ్ల ఏర్పాటుకు నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు పశుసంవర్ధకశాఖ జేడీ హేమంత్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒక పశు హాస్టల్‌ను ఏర్పాటు చేసేందుకు కనీసం పదెకరాల స్థలాన్ని కేటాయించాలంటూ రెవెన్యూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని ఆయన సోమవారం విలేకరులకు తెలిపారు.

స్థలాల కోసం ప్రతిపాదనలు పంపాం

రైతులను పోషిస్తున్న మూగ జీవాలకు రక్షణ కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక పశు హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటి ఏర్పాటుకు ఉపాధి హామీ నిధులను ఖర్చు చేయనున్నారు. ఒక్కో హాస్టల్‌కు దాదాపు పదెకరాల స్థలం అవుతుంది. విధి విధానాలను పూర్తిగా నీటి యాజమాన్య సంస్థ ద్వారా అమలు చేస్తారు. ఇప్పటికే తాము అన్ని నియోజకవర్గాల్లో పశు హాస్టళ్ల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను కేటాయించాలని రెవెన్యూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపంచాం. **- హేమంత్ కుమార్, జేడీ**

కాపు, బీసీ భవనాల నిర్మాణానికి సహకరిస్తా

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- కాపు భవన్ నిర్మాణానికి భూమిపూజ



మంత్రి టీజీ భరత్‌ని సన్మానిస్తున్న కాపు సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాపు, బీసీ భవనాల నిర్మాణాలను తాను పూర్తిగా సహకరిస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక నగరంలోని బీ.క్యాంపులో కాపు, బీసీ భవనాల నిర్మాణానికి మంత్రి టీజీ భరత్ పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014 సంవత్సర కాలంలో ఉన్న అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం కాపు, బీసీ భవనాల నిర్మాణాలకు చర్యలు చేపట్టిందని, నిదులు కేటాయించి నిర్మాణాలను పునాది స్థాయికి తీసుకొచ్చిందన్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులను అర్థాంతరంగా ఆపేయడం, నిదులు కేటాయించకపోవడంతో కాపు, బీసీల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. 2024 ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చినప్పుడు ఈ ప్రాంతంలో దట్టమైన చెట్ల పొదలు, గుంతలతో ఉందని, అప్పుడే వారికి రెండు భవనాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని వాగ్దానం ఇచ్చామన్నారు. హామీ మేరకు కాపు భవన నిర్మాణానికి రూ.1.50 కోట్లు, బీసీ భవన నిర్మాణానికి రూ.2 కోట్లు, టీజీవీ సంస్థల ద్వారా నిధులు కేటాయించి 8 నెలల్లో కాంట్రాక్టర్ ప్రభాకర్ ద్వారా నాణ్యతతో కూడిన పనులతో పార్కింగ్ ప్రదేశంతో సహా పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలో సుస్థిర పాలన సాగుతోందని, సుస్థిర పాలనతో అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రసూన, బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుసేన్, కాపు, జనసేన జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు, నగర బలిజ సంఘం గౌరవాధ్యక్షులు పత్తి ఓబులయ్య, రామస్వామి, అధ్యక్షుడు గాండ్ల లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ప్రధాన సలహాదారుడు సోమశేఖర్, ఉపాధ్యక్షుడు ఈశ్వర్ కుమార్, నాయకులు నారాయణ రెడ్డి, రామకృష్ణ, సహదేవుడు, కుళ్లాయప్ప, ప్రకాశ్ బాబు, రామిరెడ్డి, బీసీ సంఘం నాయకుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, రాంబాబు ఉన్నారు.

ఎకరాకు రూ.30 లక్షలు ఇవ్వాలి

ఓర్వకల్లు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమకు ఎకరాకు రూ.30లక్షల పరిహారం ఇవ్వాలని మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ విద్యాసాగర్‌కు బాధిత రైతులు వినతి పత్రం సమర్పించారు. బాధిత రైతులు శ్రీనివాసులు, కృష్ణుడు, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఎకరాకు రూ.15లక్షలు ఇచ్చిందన్నారు. అయితే సర్వేనెం. 509లో 22 ఎకరాలు, 12 మంది రైతుల సారవంతమైన భూములు ఉన్నాయని ఏటా రెండు పంటలు పండిస్తూ కుటుంబాలు పోషించుకుంటున్నామన్నారు. కలెక్టర్, ఆర్‌డీవో, తహసీల్దార్ సూచనల మేరకు తాము ఏపీఐఐసీకి భూములు ఇచ్చేందుకు అంగీకరించామని, అయితే ఎకరాకు రూ.30లక్షలు నష్టపరిహారం చెల్లిస్తేనే భూములు ఇస్తామనీ, లేనిపక్షంలో ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. వెంకటేశ్వర్లు, నారాయణ, వెంకటరామిరెడ్డి, చంద్రుడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



రికార్డును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

నంద్యాల ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఎరువుల షాపులను, డీలర్ల కార్యాలయాలను జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సోమవారం తనిఖీ చేశారురు. డీఎంఆర్, గోకుల్ ఏజెన్సీస్‌లలో స్టాక్ రిజిస్టర్లు, ఇన్వాయిస్‌లను తనిఖీ చేసి యూరియా, డీఏపీ నిల్వల గురించి ఆరాతీశారు. డీలర్ల నుంచి రిటైల్ డీలర్లకు వేసిన బిల్లులను పరిశీలించారు. డీఏవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి షాపు యజమాని ప్రభుత్వ అనుమతులు ఉన్న ఎరువులు, పురుగుల మందులను మాత్రమే అమ్మాలని, స్టాక్ బోర్డును ప్రతిరోజు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. అలాగే ఎరువులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరకు అమ్మితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఏవో వెంట ఏవో ప్రసాద్‌రావు ఉన్నారు.

ప్రైవేటు బ్యాంకులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దళిత యువ పారిశ్రామిక వేత్తలను వేధిస్తున్న ప్రైవేటు బ్యాంకర్లకు రాయితీ యూనిట్లను మంజూరు చేయకుండా జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా పరిశ్రమల కేంద్రం వద్ద ఆందోళన చేశారు. దళితులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగకుండా నగరంలోని ఓ ప్రైవేటు బ్యాంకు ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు ఇచ్చే రాయితీని విడుదల చేయకుండా, లంచాలు డిమాండు చేస్తున్నారని విమర్శించారు. పరిశ్రమల రాయితీ యూనిట్లను ప్రభుత్వ బ్యాంకులకే పరిమితం చేయాలన్నారు. అనంతరం కార్యాలయ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. విజయమ్మ, డీవైఎఫ్ఐ నాయకులు రాఘవేంద్ర, హుసేన్, అబ్దుల్లా పాల్గొన్నారు.



పరిశ్రమల కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

కేఎంసీ విద్యార్థులు ఆదర్శం

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి సదస్సుల్లో ప్రతిభ కనబరుస్తున్నారని, వీరిని ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ పిలుపునిచ్చారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలో నిర్వహించిన, రాష్ట్ర చర్మవ్యాధుల వైద్యుల సదస్సు (డీవీసీ)లో పీజీ సెకండ్ ఇయర్ విద్యార్థి డా.ఎస్.మనురాజ్‌కు 'బెస్ట్ పేపర్ ఇన్ కేస్ రిపోర్టింగ్'లో ఉత్తమ పేపర్ ప్రజెంటేషన్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా డీవీఎల్ డిపార్టుమెంటు విభాగాధిపతి డా.లెక్కల శ్రీదేవి అసోసియేట్ ప్రొఫెసర్ డా.కే.గౌతమితో కలిసి బెస్ట్ పీజీ వైద్య విద్యార్థి డా.ఎస్.మనురాజ్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు.



డాక్టర్ మనురాజ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, వైద్యులు

కర్నూలు జీజీహెచ్‌లో ఖరీదైన వైద్యం

- చిన్నారి ప్రాణాలను కాపాడిన వైద్యులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం అలంపూర్ మండలం రాలంపేటకు చెందిన గంగాధర్, రేణుక దంపతుల 18 నెలల కూతురు గీతాన్షికి ఉన్నట్లుండి నడవలేని పరిస్థితి నెలకొంది. దీంతో తల్లిదండ్రులు కర్నూలులోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా ఇంజెక్షన్లు వేయాలని, చికిత్సకు రూ.3 లక్షలు పైగా ఖర్చు అవుతుందని చెప్పగా.. నిరుపేదలు కర్నూలు జీజీహెచ్ చిన్న పిల్లల విభాగానికి నవంబరు 29వ తేదీన వచ్చారు. పీడియాట్రిక్ విభాగం హెచ్‌వోడీ డా.బి.విజయానందబాబు చిన్నారిని పరీక్షించి గీరియన్ బారీ (జీబీ) సిండ్రోమ్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించి నాలుగో యూనిట్‌లో కేసును అడ్మిషన్ చేయించారు. అక్కడ నాలుగో యూనిట్ చీఫ్ డా.ప్రకాష్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.లక్ష్మీనారాయణ చిన్నారికి మెరుగైన వైద్యం అందించారు. ఖరీదైన నాలుగు ఈవీ ఇమ్యునోగ్లబిలిన్స్ ఇంజెక్షన్లు వేసి నడవలేని స్థితిలో ఉన్న చిన్నారి ప్రాణాన్ని కాపాడారు. సోమ వారం చిన్నారిని డిశ్చార్జి చేయగా.. తల్లిదండ్రులు చిన్న పిల్లల విభాగం హెచ్‌వోడీ డా.బి.విజయానంద బాబుకు స్వీట్లు ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ప్రైవేటులో ఖరీదైన వైద్యం చేయించుకునే స్థోమత తమకు లేదని, కర్నూలు జీజీహెచ్‌లో డాక్టర్ల రూపంలో దేవుడే తమ బిడ్డకు ప్రాణాన్ని పోశారంటూ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్‌వోడీ మాట్లాడుతూ జీబీ సిండ్రోమ్ అనేది నరాలకు సంబంధించిందని, ఇది వెన్నుపాము ద్వారా ఇన్‌ఫెక్షన్ మొదలై మెదడుకు చేరుకుని ప్రాణాన్ని తీస్తుందని తెలిపారు. సరైన సమయంలో చికిత్స అందించినట్లు తెలిపారు.



హెచ్‌వోడీకి స్వీటు ఇస్తున్న తల్లి

డ్వాక్రా మహిళలే డిజిటల్ శక్తులు



డిజి-లక్ష్మి కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గౌరు చరిత

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డ్వాకా మహిళలే డిజిటల్ శక్తులని, డిజి-లక్ష్మీతో నగరాల్లో నూతన సేవా కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 37వ వార్డులో మెప్మా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.పార్వతమ్మతో కలిసి డీజీ లక్ష్మీ కామన్ సేవా కేంద్రాన్ని ప్రాంభించారు. రాష్ట్ర ప్రభుత్వం డిజి-లక్ష్మీ పథకం ద్వారా పట్టణాల్లో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో 9వేలకు పైగా కామన్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుందన్నారు. టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి కాసాని మహేష్‌గౌడ్, తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి.గంగాధర్‌గౌడ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ జనార్ధన్‌ఆచారి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● 37వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడిన ఎమ్మెల్యే హెల్త్ సెంటర్‌లో సమస్యలు సేవలను తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, ఖాదర్ పాల్గొన్నారు.

మరోసారి

- స్టాండింగ్ కమిటీ సమావేశం మళ్లీ వాయిదా
- 22 తీర్మానాలు, ఆమోదించినవి నాలుగే..
- ముందుగా అజెండా ఇవ్వలేదని చైర్మన్‌పై సభ్యుల ఆగ్రహం



కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్టాండింగ్ కమిటీ సమావేశం మరోసారి వాయిదా పడింది. ఈ నెల 6న నిర్వహించాల్సిన సమావేశం సభ్యులు రాకపోవడంతో వాయిదా వేసిన సంగతి విదితమే. అయితే సోమవారం నిర్వహించిన సమావేశంలో 22 అంశాలు ప్రవేశపెట్టగా కేవలం 4 తీర్మానాలను మాత్రమే సభ్యులు ఆమోదించారు. తమను లెక్కచేయడం లేదని సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం కమిటి చైర్మన్ బీవై.రామయ్య చేసిన తప్పిదాలతోనే అవుతోందని సభ్యులు ఆరోపిస్తున్నారు.

ఆమోదించిన తీర్మానాలు..

సుప్రీంకోర్టు ఏ.బీసీ నిబంధన ప్రకారం వీధి కుక్కలకు ఆశ్రమ కేంద్రం(స్టెరిలైజేషన్ సెంటర్) కల్లూరు మండలం బస్తిపాడు గ్రామం సర్వే నెంబరు.362లో ప్రహరీతో కూడిన శాశ్వత ఆశ్రయం నిర్మించేందుకు రూ.25 లక్షలు కేటాయించారు.

● కల్లూరు మండలం బస్తిపాడు గ్రామంలో వీధి పశువులు, జంతువుల కోసం జీవ షెడ్డు, సరిహద్దు రోణ గోడ, సరిహద్దు రక్షణ సౌకర్యాలతో ఆశ్రమం ఏర్పాటుకు రూ.25 లక్షలు కేటాయించారు.

● బ్యానర్లు, ఫెక్సీలు తొలగింపు డెమోలిష్ స్క్వాడ్‌ను కాంట్రాక్టు పాతిపదికన 12 మందికి ఏడాది వేతనాలను రూ.30 లక్షలు కేటాయించారు.

కమిటీలో వైసీపీ కార్పొరేటర్లు ఉన్నా..

స్టాండింగ్ కమిటీలో వైసీపీకి చెందిన కార్పొరేటర్లే సభ్యులుగా ఉన్నారు. అయితే తమకు తెలియకుండానే అజెండాలో అభివృద్ధి పనులు ఎలా పొందరుపరుస్తారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల ముందు అజెండా కాపీలను ఇవ్వకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారని సభ్యులు చైర్మన్‌ను ప్రశ్నించారు. టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే చైర్మన్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

నేడు విద్యుత్ అంతరాయం

కల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల అభివృద్ధి పనుల్లో భాగంగా మంగళవారం నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు బి.క్యాంపు సెక్షన్ పరిధిలోని సోమప్పకాలనీ, మహాలక్ష్మినగర్, ఎన్‌సీసీ క్యాంటీన్, జేసీ బంగ్లా ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్టీలో చేర్చకుంటే ఉద్యమం

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని జాతీయ ఐక్య వాల్మీక పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా ఎవరూ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ సీరియస్‌గా తీసుకుని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

ఇబ్బందులు అధిగమించి రాష్ట్రాభివృద్ధి

- 42వ వార్డు పర్యటనలో మంత్రి టీజీ భరత్



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులను అధిగమించి రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారని మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని 42వ వార్డులో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. వార్డులో రూ.2 కోట్ల అభివృద్ధి పనులలు చేశామని, మరో కోటిన్నర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. దేశంలో అత్యధిక ఆదాయం ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇవ్వని విధంగా మన రాష్ట్రంలో పింఛన్ ఇస్తున్నామని తెలిపారు. వార్డుల్లో సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానన్నారు. కమిషనర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సులో ల్యాప్రోస్కోపీ శిక్షణ



ల్యాప్రోస్కోపీ పరికరాలను పరిశీలిస్తున్న వైద్యులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులకు ల్యాప్రోస్కోపిక్ సర్జరీలో శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిందని కేఎంసీ ప్రిన్సిపాల్ డా.కె.చిట్టి నరసమ్మ పేర్కొన్నారు. సోమవారం జాన్సన్ అండ్ జాన్సన్ ఇన్‌స్టిట్యూట్ అన్ వీల్ ఆధ్వర్యంలో ఓల్డ్ గైనిక్‌వార్డు వద్ద మొబైల్ ఆపరేషన్ థియేటర్ బస్సును ఏర్పాటు చేశారు. ఈ బస్సులో రెండు రోజులపాటు పీజీ వైద్య విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లుతో కలిసి ప్రిన్సిపాల్ బస్సును ప్రారంభించారు. నూతన శస్త్రచికిత్స పద్ధతులను నేర్చుకోవడానికి అవకాశం ఉందన్నారు. జనరల్ సర్జరీ వైద్యులు అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కిరణ్ కుమార్, జాన్సన్ అండ్ జాన్సన్ ఆర్ఎం ఎం.మురళీకృష్ణ, జగదీష్, రిషి కుమార్ ఉన్నారు.

14 వరకు హస్తకళల వారోత్సవాలు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14 వరకు జాతీయ హస్తకళల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లేపాక్షి ఎంపోరియం మేనేజర్ బి. తిమ్మయ్య అన్నారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఎండీ విశ్వ.ఎం. ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం పెద్దపోస్టాఫీసు ఎదురుగా గల లేపాక్షి ఎంపోరియంలో కలంకారీ చిత్రకారుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, బనగానపల్లెకు చెందిన కె. శివప్రసాద రెడ్డిని సన్మానించారు. ఎంపోరియలో అనేక రకాల హస్తకళల వస్తువులు 10 నుంచి 20 శాతం తగ్గింపు ధరల్లో లభిస్తాయన్నారు. ఉద్యోగులు దివ్య, కిషోర్ పాల్గొన్నారు.



చిత్రకారుడిని సన్మానిస్తున్న నిర్వాహకులు

రుణాలను సకాలంలో చెల్లించాలి

సి.బెళగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న రుణాలను పొదుపు మహిళలు సకాలంలో చెల్లించాలని ఏపీఎం రమేష్ కోరారు. సోమవారం వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళల సమావేశంలో మాట్లాడుతూ పొదుపు మహిళల అభివృద్ధే ప్రభుత్వం లక్షమన్నారు.

అక్రమ బంకులను తొలగించాలి

కోడుమూరు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలల ప్రహరీకి ఆనుకుని అక్రమంగా ఏర్పాటు చేసిన బంకులను తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పాఠశాలల్లో దాదాపు 1,700 మంది విద్యార్థులు చదువుతున్నారని, బంకులలో సిగరెట్, గుట్కా అమ్ముతుండటంతో వారు చెడు వ్యసనాలకు అలవాటుపడే ప్రమాదం ఉందన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగి, విద్యార్థుల రాకపోకలకు అవస్థలు పడుతు న్నారన్నారు. మోడల్ స్కూల్ రహదారింనని బాగులచేయాలని కోరారు. మండల కార్యదర్శి అల్తాఫ్, బాషా పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కేవీ సుబ్బారెడ్డిలో ప్లేస్‌మెంట్ డ్రైవ్



ఉద్యోగాలకు ఎంపికైనవారితో కళాశాల యాజమాన్యం

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగర శివార్లలోని కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ప్లేస్‌మెంటు డ్రైవ్ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఈఫైల్ టెక్ సొల్యూషన్స్ సంస్థ ప్రతినిధులు 50 మంది విద్యార్థులను పరీక్షించి, 35 మందిని ఉద్యోగాలకు ఎంపికచేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి, కరస్పాండెంట్ విజయలక్ష్మమ్మ, ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, ప్లేస్‌మెంటు ఇన్‌చార్జి ఝాన్సీరాణి అభినందించారు.

13న షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న శనివారం అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు సోమవారం తెలిపారు. సీనియర్ పురుషులు, స్త్రీల విభాగంలో నిర్వహిస్తున్నట్లు, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 18 నుంచి 21 వరకు జిల్లాలో జరగబోయే 44వ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9989982655, 7013886343 నెంబర్లను సంప్రదించాలన్నారు.



ఈశ్వర్ నాయుడు

20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- కంపెనీలకు తగ్గట్టుగా జిల్లా యువతకు శిక్షణ
- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



జాబ్ మేళాలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్



శ్రీచైతన్య కళాశాలలో పోస్టర్ విడుదల చేస్తున్న మంత్రి

కర్నూలు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నిల్లో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే తన లక్ష్యమని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ పెర్కొన్నారు. సోమవారం కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో నేషనల్ కేరీర్ సర్వీసు, ఏపీఎస్ఎస్‌డిసీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను మంత్రి ప్రారంభించారు. విద్య, ఐటీ మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు కానున్న కంపెనీలకు తగ్గట్టుగా యువతకు శిక్షణ ఇస్తున్నామన్నారు. 1,550 మందికి ఉద్యోగాలు ఉన్నాయని, 21 కంపెనీలు జాబ్ మేళాలలో పాల్గొన్నాయన్నారు. జిల్లా ఉపాధికల్పనాధికారి పి. దీప్తి మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగులంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఆనంద్ రాజ్ కుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ జజి. గిరిజారాణి, ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, ఓఎస్టీ ఎస్ఎం బాషా, ఎంప్లామెంట్ ఆఫీసర్ సి. చంద్రకళ, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాంపస్‌లోనే పరిశ్రమల ఏర్పాటు హర్షణీయం

కర్నూలు ఎడ్యుకేషన్: క్యాంపస్‌లోనే పరిశ్రమల ఏర్పాటు హర్షణీయమని మంత్రి టీజీ భరత్ అన్నారు. బి.తాండ్రపాడు శ్రీచైతన్య బాలుర హాస్టల్ క్యాంపస్‌లో సోమవారం ఇంటర్ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, ఉన్నత లక్ష్యాల అంశంపై కేఎల్ యూనివర్సిటీ, శ్రీ చైతన్య విద్యాసంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల కోసం కేఎల్ యూనివర్సిటీ అమలు చేస్తున్న ప్రణాళికలను మంత్రి ప్రశంసించారు. ప్రతిష్ఠాత్మకైన పరిశ్రమలు ఎన్నో రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్నాయనీ, తద్వారా యువతకు మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కేఎల్ యూనివర్సిటీ డైరెక్టర్ డా.జే.శ్రీనివాసరావు సమకాలిన విద్యావిదానాలను విశ్లేశించారు. రాయలసీమ జోన్ హెడ్ కేశవగౌడు, శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం మురళికృష్ణ, డీన్ బాలాజీ, జోనల ఇన్‌చార్జి కృపరాజు, అద్యాపకులు పాల్గొన్నారు.

అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కర వేదికకు వచ్చే అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని నగర పాలిక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులు అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అర్జీదారుడు సంతృప్తి చెందేలా చూడాలని ఆదేశించారు. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ, డిప్యూటి కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, ఎంఈ మనోహర్‌రెడ్డి, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా.వై.నాగప్రసాద్‌బాబు, ఆర్‌ఓ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ విశ్వనాథ్

● వీకర్ సెక్షన్ కాలనీ బిల్డింగ్స్‌లో రోడ్లు, స్మశాన వాటికకు స్థలం ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు అలివేలు,నగేష్ కమిషనర్ పి.విశ్వనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. రహిమాన్ జమ్మన్న, సత్యం, ఐద్వా నాయకురాలు ఎస్.శ్యామల ఉన్నారు.

● పాతనగరం పార్కుల్లో నాసిరకంగా నిర్మాణాలు చేస్తుండటంతో ప్రజాధనం వృథా అవుతుందని పట్టణ పౌర సంక్షేమ సంఘం సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి అన్నారు. పార్కులను అభివృద్ధి చేయాలని వినతి పత్రం అందజేశారు. ఎండీ.యూనుస్, ఎస్.వెంకటేశ్వర్లు, ఈ.లక్ష్మణ గౌడు, సి.మురళి తదితరులు పాల్గొన్నారు

కోడుమూరులో వైసీపీకి షాక్

- టీడీపీలో చేరిన మారందొడ్డి వైసీపీ నాయకులు

కర్నూలు రూరల్ డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. సి.బెళగల్ మండలం మారందొడ్డి గ్రామానికి చెందిన దాదాపు 250మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం కర్నూలులో కేడీసీసీబీ చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మారందొడ్డి మాజీ సర్పంచ్ రుక్మంద, వార్డు సభ్యుడు ఉప్పరి సోమన్న మాట్లాడుతూ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మెన్ విష్ణువర్ధన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్శితులమై పార్టీలో చేరామన్నారు. సి.బెళగల్ మండలంలో వైసీపీ ప్రజా మన్ననలను కోల్పోయిందని, దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజల స్థితిగతులు, గ్రామా అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని ఆరోపించారు. టీడీపీలో చేరిన వారిలో సుధాకర్, ఎల్లప్ప, యేసేపు, పౌలు, బడేసా, సుభాన్ ఉన్నారు. కన్వీనర్ చంద్రశేఖర్, పోలకల్ అమర్, జక్రియ బాషా విక్రమార్కుడు పాల్గొన్నారు.

తక్షణ పరిష్కారం చూపాలి

గూడూరు డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని తహసీల్దార్ వెంకటేష్ నాయక్ ఆదేశంచారు. సోమవారం కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

ముగిసిన కళాశాలల టోర్నమెంట్

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల అంతర్ కళాశాలల టోర్నమెంట్ ముగిసిందని బి.క్యాంపు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.ఇందిరాశాంతి తెలిపారు. పీడీ వై.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ క్రికెట్ పురుషుల విభాగంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిల్వర్ జూబ్లీ కలాశాలపై విజయం సాధించి ప్రథమ స్థానం సాధించిందని, ఫుట్‌బాల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెన్స్ గెలుపొందారన్నారు. అలాగే మహిళల ఫుట్‌బాల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రథమ స్థానం సిల్వర్ జూబ్లీ కళాశాల రన్నర్, కేవీఆర్ కళాశాల తృతీయ స్థానం సాధించాయి. విజేతలకు అతిథి రిజిస్ట్రార్ డా.జి.శ్రీనివాస్ బహుమతులు అందజేశారు.



విజేతలతో రిజిస్ట్రార్ శ్రీనివాస్

మెడికల్ కాలేజీ ఏవోగా నాగమణి

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నాగమణిని నియమిస్తూ వైద్యఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్ గౌర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ప్రస్తుతం ఆదోని మెడికల్ కాలేజీ ఏవోగా ఉన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో ఏవో పోస్టు ఖాళీగా ఉండటంతో పరిపాలన కారణాలపై బదిలీ ఉత్తర్వులపై నిషేదాన్ని సడలిస్తూ కేఎంసీకి బదిలీ చేసినట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు. కాగా కర్నూలు వైద్య కళాశాలలో ఇంకా ఏడీ పోస్టు కూడా ఖాళీగా ఉంది.

మరుగుదొడ్లలో వసతులు కల్పించాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బుధవారోపేట హంద్రీ వంతెనకు అనుకుని ఉన్న సామూహిక మరుగుదొడ్లకు కనీస వసతులు కల్పించాలని కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు ఎన్‌జి.కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ లెక్చరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న దళితవాడలో సుమారు 30వేల మంది ఉన్నారన్నారు. నిర్వహణ లేక దుర్వాసన వస్తోందని, కార్మికుడిని ఏర్పాటు చేయాలని, అలాగే విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. రెడ్డిపోగు రమణ, రాజు పాల్గొన్నారు.

మానవ హక్కులను కాపాడాలి

కర్నూలు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆర్‌యూ రిజిస్ట్రార్ బోయ విజయ కుమార్ నాయుడు అన్నారు. సోమవారం యూనివర్సిటీలో అంతర్జాతీయ మానవ హక్కులను దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ తరఫున వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈనెల 10న స్థానికి క్లస్టర్ యూనివర్సిటీలో జరిగే కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ఇస్తామన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు, వెంకటరత్నం, విజయుడు, నాగచంద్రుడు, శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం కళాశాలలపై చర్యలు తీసుకోవాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ సిరికిఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మహేష్, ప్రశాంత్, అనిల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన శాలివాహన సంఘం నాయకులు



ఎమ్మెల్యే చరిత, గౌరు వెంకటరెడ్డి దంపతులతో నాయకులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శాలివాహన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.కృష్ణమూర్తి, ప్రెసిడెంట్ కేసీ నాగన్న ఆధ్వర్యంలో సంఘం నాయకులు సోమవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి దంపతులను కలిశారు. వారికి తమ సంఘ నాయకులను పరిచయం చేశారు. సంఘ అభివృద్ధికి సహకరిస్తామని ఎమ్మెల్యే దంపతులు వారి హామీ ఇచ్చారు. జిల్లా కార్యదర్శి రమేష్, నగర గౌరవ అధ్యక్షుడు మధు, జిల్లా ఉపాధ్యక్షులు చిన్న గిడ్డయ్య, తిరుపతయ్య, రామకృష్ణ, కార్యదర్శి శ్రీనివాసులు, ప్రచార కార్యదర్శులు ప్రకాశ్, రాముడు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న గౌరు చరిత, వెంకట రెడ్డి

టీడీపీ నాయకుడి మృతి

కల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.పార్వతమ్మ భర్త కె.లక్ష్మయ్య ఆచారి(58) సోమవారం మృతి చెందారు. సాయంత్రంలో కార్డియక్ అరెస్ట్ కావడంతో నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో వీకర్‌సెక్షన్‌కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి నివాళి అర్పించారు. ఆయనకు ఇద్దరు కుమారులు కె.జనార్ధన్‌ఆచారి, శివాఆచారి టీడీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు.

● జిల్లాకు వచ్చిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజను కలెక్టర్ సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి కలిశారు. సోమవారం ప్రభుత్వం అతిథి గృహంలో ఆమెతో సమావేశమయ్యారు. జిల్లాలో మహిళల భద్రత, సంక్షేమ కార్యక్రమాలు, బాల్య వివాహాల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న అంతర్గత పిర్యాదుల కమిటీలు(ఐసిసి) కార్యకలాపాలపై చర్చించారు.



కమిషనర్‌కు చెక్కు ఇస్తున్న అధికారులు

వ్యాపారుల సహకారం అభినందనీయం

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధికి పన్నులు చెల్లిస్తున్న వాణిజ్యసముదాయాల యజమానుల సహకారం అభినందనీయమని కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. సోమవారం మూడు దుకాణాల నుంచి వసూలు చేసిన రూ.10,64,11 చెక్కులను రెవెన్యూ సిబ్బంది కమిషనర్‌కు అందజేశారు. పౌరులంతా సకాంలోన పన్నులు చెల్లించి, నగర అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ సూచించారు. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ, డిప్యూటి కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ఆర్వో జునైద్, ఆర్ఐలు రాజు, భార్గవ్, సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

బాలికకు కిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స


కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కిమ్స్ హాస్పిటల్ వైద్యులు ఓ బాలికకు అరుదైన శస్త్రచికిత్స చేసి కణితిని తొలగించారు. సోమవారం ఆసుపత్రిలో వైద్యులు వివరాలు వెల్లడించారు. నంద్యాలకు చెందిన 6వ తరగతి చదువుతున్న 12 ఏళ్ల బాలికకు అత్యంత అరుదైన సమస్య వచ్చింది. 30-50 ఏళ్ల మధ్యన మాత్రమే వచ్చే అడ్రినల్ గ్రంధి కణితి చిన్న వయస్సులో రావడం అరుదు. ఉన్నట్లుండి తలనొప్పి, బీపీ పెరగడంతో తల్లిదండ్రులు స్కానింగ్ చేయించగా అడ్రినల్ గ్రంధిలో వాపు ఉన్నట్లు గుర్తించి కిమ్స్ కడల్ ఆసుపత్రికి తీసుకుని వచ్చారు. పరీక్షలు చేసిన వైద్యులు చేయగా.. అడ్రినల్ గ్రంథిలో కణితి (ఫియోక్రోమో సైటోమా)ఉన్నట్లు కన్సల్టెంట్ పీడియాట్రిక్, నియోనాటల్ సర్జన్, యురాలజిస్టు డా.సాయిప్రసూన గుర్తించారు. బీపీ అదుపులోకి వచ్చాక ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో కణితిని పూర్తిగా తొలిగించారు.



బాలికతో కిమ్స్ వైద్యులు

సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం

కర్నూలు రూరల్ డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించపోతే ఉద్యమానికి సిద్ధమవుతామని ఏపీపీటీడీ ఈయూ కార్యదర్శి ఏవీరెడ్డి హెచ్చరించారు. మూడోరోజు నిరసనలో భాగంగా సోమవారం కర్నూలు-2 డిపో వద్ద కార్మికులు గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్యదర్శి మహేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథి ఏవీరెడ్డి మాట్లాడుతూ కర్నూలు-2 డీఎం సిబ్బందిని ఇబ్బందులు పెడుతున్నారని, పలుమార్లు సమస్యలను తెలిపినా పరిష్కరించకుండా నిర్లక్షంగా వ్యవహరిస్తుండటంతో కార్మికులలో అసంతృప్తి పెరిగిందన్నారు. డ్రైవర్లకు విశ్రాంతి గదుల్లో వసతులు కల్పించాలన్నారు. గ్యారేజి కార్యదర్శి వీరేష్, కోశాధికారి శివకేశన్న, ప్రచార కార్యదర్శి సుజయ్ రాజు, జాయింట్ సెక్రటరి కృష్ణ, పద్మావతిబాయి, పెద్దస్వామి, ప్రసాద్, సుంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీఈవోలు

సమస్యలు పరిష్కరించాలి

కల్లూరు/అగ్రికల్చర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని ప్రాథమిక వ్యవసాయ సహకార ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కృష్ణానగర్ బ్రాంచ్ మేనేజర్ ఎం.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఉలిందకొండ, కల్లూరు సంఘాల సీఈవోలు అరిఫ్‌బాషా, పుల్లయ్య మాట్లాడుతూ జీవో నెం. 36ను అమలు చేయాలని, 2019, 2024 పెండింగ్ వేతన సవరణలు చేసి ఐఆర్ ఇవ్వాలన్నారు. పరదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, రూ.5 లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్యబీమా కల్పించి, సర్వీస్‌లో మరణిస్తే రూ.20 లక్షల టర్మ్‌ఇన్స్‌రెన్సు పాలసీతో భరోసా కల్పించాలన్నారు. బ్యాంకుల ద్వారా రైతులకు నేరుగా రుణాలు ఇవ్వడంతో సహకార సంఘాలు నిర్వీర్యమైపోతు న్నాయని, దీన్ని మార్చాలన్నారు. సంఘాలు చెల్లించిన షేరుపై కనీసం ఆరు శాతం డివిడెండ్ లేదా వడ్డీ చెల్లించాలని కోరారు.

జిల్లా సాధనకు పల్లెలు కదలాలి

● 10న బంద్‌కు జేఏసీ పిలుపు
● 23వ రోజు దీక్షలో పద్మశాలీయులు
● కలిసి పోరాడుదామన్న ఎమ్మెల్యే పార్థసారథి



దీక్షకు మద్దతు తెలుపుతున్న పద్మశాలీ సామాజిక వర్గ పెద్దలు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆదోని జిల్లా సాధన కోసం ప్రతి పల్లె కదలిరావలని జిల్లా సాధన సమితి జేఏసీ నాయకులు రఘురామయ్య, కృష్ణమూర్తి గౌడ్, కోదండ, నూర్ అహ్మద్, దేవిశెట్టి ప్రకాష్, టి వీరేష్, ప్రకాష్ జైన్, అశోకానంద రెడ్డి, దస్తగిరి నాయుడు అన్నారు. ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గం కలిపి ఆదోని జిల్లాగా చేయాలని చేపట్టిన ఆందోళన రోజు రోజుకు ఉధృతం అవుతోంది. సోమవారం 23వ రోజు పద్మశాలీ సామాజిక వర్గం బుదారపు లక్ష్మణ, చిలకా శేఖర్, బి నాగరాజు, చిలకా కృష్ణ, గంజి వీరభద్రస్వామి, జేరుబండి కృష్ణమూర్తి, రామాంజనేయులు, మార్కండేయ స్వామి దేవాలయంలో పూజలు చేసి ర్యాలీగా వచ్చి దీక్షలో కూర్చున్నారు. దీక్షలకు మద్దతుగా చిన్మయ విద్యాలయం విద్యార్థులు భారీ ర్యాలీతో ఆదోని జిల్లాతోనే సమాగ్రాభివృద్ధి అని నినాదిస్తూ సంఘీభావం ప్రకటించారు. కోట్ల కూడలిలో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రతి సామాజిక వర్గం సామన్యులు సైతం జిల్లా చేయాలంటూ డిమాండ్ వస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నియోజవర్గంలో ఆందోళనలు దీక్షలు చేపట్టారని ప్రభుత్వం పశ్చిమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు జిల్లా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 10న చేపట్టిన ఆదోని బంద్‌కు సామాన్యులు విద్యాసంస్థలు దుకాణదారులు స్వచ్ఛందంగా బందు పాటిస్తామని ప్రకటించారు. బంద్‌కు ప్రతి ఒక్కరు సహకరించి నినాదాన్ని ప్రభుత్వానికి వినిపిద్దామని విజ్ఞప్తి చేశారు.

నాలుగు మండలాలకే కట్టుబడి ఉన్నా : ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని రూరల్ : ఒక్క మండలం అయ్యే ప్రసక్తే లేదు... నేను ఒప్పుకోను... నాలుగు మండలాలకే కట్టుబడి ఉన్నానంటూ, ఎమ్మెల్యే పార్థసారధి తెలిపారు. ఆదోనికి దగ్గర్లో ఉన్న తమ గ్రామాలను కొత్త మండలంలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ, ఆయా గ్రామాల నాయకులు గోనహాళ్ గోపాల్‌రెడ్డి, గణేకల్ విరుపాక్షి, బసాపురం రామస్వామి, హనవాళ్ మహబూబ్ బాష, మదిరె సర్పంచ్ నారాయణ, ఢణాపురం మల్లికార్జున, తదితరులు సోమవారం ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్ళి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడుతూ, ఆదోనిమండల ప్రజలకు ఇచ్చిన మాటప్రకారం నాలుగు మండలాలకే కట్టుబడి ఉన్నాని, ఒక్క మండలం అయ్యే ప్రసక్తే లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న 16గ్రామాల నాయకులు

ఆదోని జిల్లా కోసం, నాలుగు మండలాల కోసం కలిసి కట్టుగా పోరాడుదామని ఎమ్మెల్యే వారికి సూచించారు.

పెద్దహరివాణం మండలంలో మా గ్రామాలను కలపకండి..

పెద్దహరివాణం మండలంలో తమ గ్రామాలను కల్పొద్దంటూ, బాధితగ్రామాల ప్రజలు బైకు ర్యాలీ నిర్వహిస్తూ, సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపట్టారు. తమ గ్రామాలు హొళగుంద మండలంలోనే కొనసాగాలని కోరుతూ, సబ్ కలెక్టర్ అజయ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు.

ఆలూరు: వెనుకబడిన ఆలూరు ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని జిల్లా సాధన జేఏసీ కమిటీ నాయకులు కత్తి రామాంజనేయులు, భూపేష్, రవీంద్రరావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఈనెల 12 నుంచి ఆలూరు పట్టణంలో ఆదోని జిల్లా సాధనకై చేపట్టనున్న రిలే దీక్షకు అనుమతినివ్వాలని ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐ మన్మదవిజయ్‌ను కలిసి కోరారు. అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు, విద్యార్థులు, ఉద్యోగ సంఘాల మద్దతుతో ఈనెల 12న ఆలూరులో చేపట్టబోయే రిలే దీక్షలకు మద్దతు ఇవ్వాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారు రామకృష్ణ, రాముయాదవ్, గోపాల్, రంగస్వామి, నాగ్ పాల్గొన్నారు.



భీమాస్ కూడలిలో మానవహారం చేపట్టిన విద్యార్థులు

సివిల్ సప్లై అధికారులపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కృష్ణ

వెల్దుర్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం నిర్దేశించిన వాహనాలలో బియ్యం తరలించకుండా ఇష్టారాజ్యంగా ప్రైవేటు వాహనాలలో తరలిస్తున్నా సివిల్ సప్లై అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ సోమవారం కర్నూలు కలెక్టర్ సిరికి ఫిర్యాదు అంద జేశారు. అలాగే వెల్దుర్తిలో గ్యాస్ ఏజెన్సీ. వినియోగదారుల నుంచి అక్రమంగా డబ్బు వసూలు చేస్తోందని, గ్యాస్ ప్రమాదంలో మరణించిన, గాయపడిన వారికి ఏజెన్సీ నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నమాదులు, రాజు ఉన్నారు.

ఎన్టీఆర్ సేవలు మరువలేనివి

తుగ్గలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సేవలు మరువలేనివని టీడీపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాతనలో గత రెండు రోజుల క్రితం మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ విగ్రహం ఏర్పాటుకు అహర్నిశలు కృషి చేసిన మనోహర్ చౌదరిని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు సన్మానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈరన్న స్వామి, గాలయ్యాచారి, సంజీవ, కోట్రేష్ చౌదరి, శ్రీనివాసులు, దేవేంద్ర తదితరులు ఉన్నారు.

అండర్ 16 కబడ్డీ విజేతగా దేవనకొండ జట్టు



ట్రోఫీతో విద్యార్థులు

దేవనకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అండర్-16 కబడ్డీ పోటీలలో దేవనకొండ రెయిన్బో పాఠశాల జట్టు ప్రథమ విజేతగా నిలిచింది. ఆదివారం ఆదోనిలో జరిగిన అండర్-16 కబడ్డీ పోటీలలో ప్రథమ విజేత జట్టుగా నిలిచినట్లు రెయిన్‌బో పాఠశాల కరస్పాండెంట్ అల్లిపీరా తెలిపారు. విజేత జట్టు ఆటగాళ్లని పాఠశాల హెచ్ఎం విశాలాక్షి, రవి, పీటి లోకేష్ అభినందించారు

'మా పొలం వేరేవారికి రాసిచ్చారు'



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బాధితురాలు లక్ష్మీదేవి

మద్దికెర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా తమ అధీనంలో ఉన్న పొలంలోని 41 సెంట్ల స్థలాన్ని వేరే వ్యక్తులకు రాసిచ్చారని మద్దికెర గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, రామలింగలు ఆరోపించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గూండాల్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. దాదాపు 40 సంవత్సరాలుగా మా ఆధీనంలో మాకు ఇచ్చిన హద్దులో ఉంటూ మేము సాగు చేసుకుంటున్నామనీ, మా పొలం పక్కన ఉన్న బాల రంగయ్య అనే అతను మాకు తెలియకుండా సర్వే చేయించి ఆక్రమించుకున్నారనీ అన్నారు. అలాగే మద్దికెర గ్రామానికి చెందిన శ్రీరాములు తమకు 72 సెంట్ల స్థళం ఉండగా.. సర్వే అధికారులు హద్దులు చూపడం లేదని తహసీల్దార్‌కుఫిర్యాదు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ రికార్డులు చూసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఆలూరు డిప్యూటీ ఎంపీడీవోగా సునీత



ఆలూరు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మండల డిప్యూటీ ఎంపీడీఓగా జి.సునీత సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొలిమిగుండ్ల ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సునీతను ఆలూరు డిప్యూటీ ఎంపీడీఓగా నియమించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీఓ జి.సునీత విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సచివాలయాల ద్వారా సక్రమంగా అందిస్తామని చెప్పారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు.

నిధులు కేటాయించాలి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగానికి వచ్చే బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రిస్వామి కోరారు. సోమవారం భీమాస్ హాల్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. నవంబర్ 28 నుంచి నాలుగు రోజులు పాటు డెహ్రాడూన్‌లో జరిగిన ఏబీవీపీ 71వ జాతీయ మహాసభలు విజయవంతం అయ్యాయన్నారు.. సమావేశంలో జిల్లా కన్వీనర్ వీరేష్, కార్యవర్గ సభ్యుడు గోవిందు, ఉమా మహేష్, శివ పాల్గొన్నారు.

సంచార చికిత్స కేంద్రం తనిఖీ

వెల్దుర్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):మండలంలో మదార్‌పురం గ్రామంలో సోమవారం నోడల్ అధికారి రఘురామరాజు సంచార చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని అన్నారు. డాక్టరు శ్రీధర్‌రెడ్డి, పర్యవేక్షకురాలు నాగలక్ష్మి, సామాజిక ఆరోగ్య అధికారి ఆదిలక్ష్మి, అన్నపూర్ణ, అయేషా, భారతి, ఖలీల్ పాల్గొన్నారు.

సీఎం దృష్టికి ఆదోని అంశం



సీఎంకు వినతి పత్రం ఇస్తున్న బీటీ నాయుడు

ఆదోని, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆదోనిని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని జరుగుతున్న ఉద్యమాల వివరాలను ఎమ్మెల్సీ బీటీ నాయుడు సోమవారం సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం నివాసంలో ఆయనను కలిసిన ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఆదోని జిల్లా ఏర్పాటు ఆవశ్యకతపై ముఖ్యమంత్రికి వివరించారు. ఆదోని జిల్లా డిమాండ్‌పై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఆశాభావం వ్యక్తం చేశారు.

టీడీపీ ఏపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డా ఫక్రుద్దీన్..

ఆదోనిని జిల్లా కేంద్రం ఏర్పాటు చేయాలని, అలాగే ఆదోనిలో ఆటోనగర్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతూ టీడీపీ ఏపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డా ఫక్రుద్దీన్ సీఎం నారా చంద్రబాబునాయుడిని కలిశారు. ఆదోని జిల్లా చేయాలంటూ కోరుతూ సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు.బషీర్‌అహ్మద్, గౌస్‌బాషా, నిజామి, పట్టణాధ్యక్షుడు హుసేన్‌అహ్మద్, జిలానీబాషా పాల్గొన్నారు.

వైద్య విద్యను అందించే బాధ్యత ప్రభుత్వాలదే

పత్తికొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయకుండా ప్రజలందరికీ ఉచిత వైద్య విద్యను అందించడం ప్రభుత్వాలదే బాధ్యత అని మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ అన్నారు. సోమవారం స్థానిక మడ్డీగేరిలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మాజీ ఎంపీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రజా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సోమశేఖర్, కొమ్ము దీపిక, కొమ్ము నెట్టికల్, పాల్‌బాషా, నాగరాజు, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

'డబ్బులు వాడుకున్న మాట వాస్తవమే'

మద్దికెర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మద్దికెర గ్రామానికి చెందిన గొడుగు మల్లికార్జున స్థానిక పోస్టాఫీసులో సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా డబ్బులు డిపాజిట్ చేస్తే అప్పటి పోస్టుమాస్టర్ పోస్టాఫీసులో జమ చేయకుండా డబ్బులు వాడుకున్నది వాస్తవమేనని డోన్ తపాలా శాఖ ఇన్స్‌పెక్టర్ జయకృష్ణ అన్నారు. ఈ నెల 4వ తేదీన ఆంధ్రజ్యోతిలో పోస్టాఫీసులో సొమ్ము మాయం.. లబోదిబోమంటున్న బాధితుడు అనే వార్తకు స్పందించిన డోన్ తపాలశాఖ ఆదేశాల మేరకు డోన్ పోస్టల్ ఇన్స్‌పెక్టర్ జయకృష్ణ మద్దికెర గ్రామంలోని తపాలాశాఖను సందర్శించి సంబందిత బాధితుడు మల్లికార్జునను సోమవారం విచారణ చేశారు. పోస్టాఫీసులో ఎంతో నమ్మకంతో పొదుపు చేసుకున్నాడనీ, ఆ డబ్బు ఎక్కడికి పోదని తెలిపాడు. ఖాతాదారుడి పాస్ పుస్తకాన్ని తీసుకుని కొత్తది ఇస్తామన్నారు. పై అధికారులకు నివేదికలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టుమాస్టర్ రమేశ్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పత్తికొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన కూలీలకు తక్షణమే బకాయిలను చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ కవితకు వినతి పత్రం సమర్పించారు. సీపీఐ ప్రజా సంఘాల నాయకులు రామంజిని, కారుమంచి, పీరన్న, కారన్న, గిడ్డయ్య, కాశీ, నెట్టి తదితరులు పాల్గొన్నారు.

సులభ పద్ధతిలో బోధించాలి

మద్దికెర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థినీ విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధించాలని మండల విద్యాధికారి రంగస్వామి తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన మద్దికెరలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు బసవరాజు, దేవేంద్రప్ప పాల్గొన్నారు.

నెట్టేకల్ దేవరకు భారీ బందోబస్తు



మాట్లాడుతున్న సీఐ

ఆదోని రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులపాటు నెట్టెకల్‌లో జరిగే ఊరు దేవరకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తాలుక సీఐ నల్లప్ప తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, నెట్టేకల్ గ్రామం సమస్యాత్మక గ్రామం కావడంతో ఇద్దరు సీఐలు, ఆరు మంది ఎస్.ఐలతోపాటు దాదాపు 85మంది సిబ్బందితో పకడ్బందీగా బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. శాంతియుత వాతావరణంలో ప్రజలు దేవర ఉత్సవాలను నిర్వహించుకోవాలని, అల్లర్లు సృష్టించినా, పాల్పడిన సహించబోమని, అలాంటి వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

పెద్దహరివాణంలో డబ్ల్యూడీసీ పనులకు శ్రీకారం



పనులను ప్రారంభిస్తున్న మాన్వి దేవేంద్రప్ప

ఆదోని, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామంలో వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (డబ్ల్యూడీసీ) పనులను సోమవారం ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప ముఖ్య అతిథులుగా పాల్గొని నీటి గుంత నిర్మాణానికి భూమిపూజ చేశారు. నంతరం మాన్వి దేవేంద్రప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రతిఒక్క సంక్షేమ పథకాలను, వ్యవసాయ రంగానికి సంబంధించిన పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పనులు గ్రామాభివృద్ధికి, రైతుల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూడీసీ చైర్మన్ బోయ సోమ పాల్గొన్నారు.

రహదారుల దుస్థితి కనిపించదా..?

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య



శమదానం చేస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రహదారులపై భారీగా గుంతలు పడి అటు ప్రయాణికులు, ఇటు వాహనదారులు అవస్థలు పడుతున్నా పాలకులకు కనిపించవా అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య పేర్కొన్నారు. సోమవారం పట్టణ శివారులోని వి.కె.నగర్ సమీపాన పత్తికొండ-ఆదోని ప్రధాన రహదారి దెబ్బతిని భారీగా గుంతలుపడిన రోడ్లను ఆయన పరిశీలించారు.. అటు అధికారులు, ఇటు పాలకులు పట్టించుకోకపోవడంతో సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో గుంతలను మట్టితో పూడ్చి సీపీఐ శ్రేణులు శ్రమదానం చేపట్టారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజినేయులు, మండల కార్యదర్శి కారుమంచి, ప్రజా సంఘాల నాయకులు వీరన్న, వెంకటరామిరెడ్డి, కారన్న, ఉసేని, కాశీ, గిడ్డయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

వెల్దుర్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):మండలంలో చెరుకులపాడు గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్ పాఠశాలను సోమవారం మండల విద్యాధికారి ఇందిర ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక సక్రమంగా అమలుచేయాలని అన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు తెలియజేశారు.

నిరసన బాట పట్టిన సహకార ఉద్యోగులు



నిరసన తెలుపుతున్న సహకార ఉద్యోగులు

ఆలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ సహకార పరపతి సంఘం ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. గత మూడు రోజులుగా విధులు బహిష్కరించి ఆందోళన చేపడుతున్నారు. సోమవారం ఆలూరు కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. వీరి నిరసనకు బ్యాంకు మేనేజర్ రవిప్రకాష్, సిబ్బంది, సీఐటీయూ నాయకులు మద్దతు ప్రకటించారు. సంఘం ఉపాధ్యక్షుడు హరికృష్ణ, సీఈఓలు వెంకటరెడ్డి, వీరస్వామి, నరసింహ, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల భవనాలు పూర్తి చేయాలి

దేవనకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేవనకొండ సంతమార్కెట్ వద్ద నిర్మిస్తున్న ఉర్దూ పాఠశాల నిర్మాణం పూర్తి చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి భాస్కర్ అన్నారు. పాఠశాల నిర్మాణ పనులు గత ఐదేళ్లుగా చేయలేకపోవడంతో ముళ్లపొదలతో నిండిపోయిందన్నారు. ఉర్దూ పాఠశాలకు సొంతభవనాలు లేక ఎంపీపీ పాఠశాలలోనే అసౌకర్యాల మధ్యలో పాఠశాలను కొనసాగించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభించాలన్నారు.

శ్మశానాన్ని అభివృద్ధి చేయాలి

ఆదోని, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలోని శుక్రవారంపేటలో మారెమ్మవ్వ గుడి వెనుక ఉన్న హిందూ శ్మశానాన్ని అభివృద్ధి చేయాలని బీజేపీ నాయకులు కునిగిరి నీలకంఠ, సురేష్ కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు గోవిందరాజులు, వాల్మీకి మహదేవ్, చంద్ర, పరమేష్, రామకృష్ణ, తిక్కన్న పాల్గొన్నారు.

మిరప రైతులను ఆదుకోవాలి



ఆదోని సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఆదోని, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర దిగువ కాలువ కింద మిరప పంట సాగు చేస్తున్న రైతులను ఆదుకునేందుకు ఫిబ్రవరి ఆఖరి వరకు సాగునీరు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, ఉపాధ్యక్షులు మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న, తిక్కన్న, రైతు సంఘం జిల్లా నాయకులు బాషా, ఈరన్నలు పాల్గొన్నారు

కందులకు గిట్టుబాటు ధర కల్పించాలి

తుగ్గలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎంతో కష్టపడి పండించిన కంది పంట దిగుబడి నామమాత్రంగా వచ్చిందని, ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబీ రసూల్, మండల అధ్యక్షుడు సుల్తాన్ కోరారు. సోమవారం మండల కేంద్రమైన తుగ్గలిలో ప్రధాన రహదారిపై రైతులతో కలిసి రాస్తారోకో చేశారు. అనంతరం తహసీల్దార్ రవికి వినతి పత్రం అందజేశారు. సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, సీపీఐ నాయకులు ఉమాపతి, సూరారెడ్డి, మద్దిలేటి, తదితరులు ఉన్నారు

పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాలు (దివ్యాంగులు) కలిగిన విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యామ్నాయ పాఠశాల కో ఆర్డినేటర్ సురేంద్ర, బాపూజీ మండల విద్యాశాఖ అధికారి భూపాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని తిరుమల నగర్ భవిత కేంద్రంలో ఏపీ సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ లోకరాజు, ఆదేశాలతో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలి

పత్తికొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కేడీసీసీ బ్యాంకు ఎదురుగా సహకార సంఘం ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు ఉద్యోగుల ధర్నాకు మద్దతు తెలిపారు. సహకార సంఘాల సీఈఓలు ఏసుప్రవక్త, రహంతుల్లా, గిడ్డయ్య, ఏఐటీయూసీ నాయకులు రంగన్న, సీఐటీయూ నాయకులు రవిచంద్ర పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్ పోటీలకు ఎంపిక

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్ద హరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థి ఏ తాఫిక్ రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి తౌఫిక్‌ను అభినందించారు. ఈనెల 27న తిరుపతి నేషనల్ సాంస్క్రిట్ యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలలో పాల్గొంటారన్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుడు చిరంజీవి పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

ఆలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ప్రాజెక్టు పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈనెల 8వ తేదీ గడిచినా నవంబర్ నెలకు సంబంధించిన వేతనాలు పడకపోవడంతో చిరుద్యోగులు ఇంటి అద్దెలు చెల్లించలేక, కుటుంబ పోషణ భారంగా మారిందని సమగ్రశిక్ష ఉద్యోగుల రాష్ట్ర కో కన్వీనర్ మహమ్మద్‌రఫీ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరోవైపు క్రిస్మస్ పండగ ఉండడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. బడ్జెట్ ఉన్నప్పటికీ కర్నూలు జిల్లాలో మాత్రమే వేతనాలు జమ కాలేదన్నారు. విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని కోరారు.

నేడు స్వర్ణామృత ప్రాశనం పంపిణీ

ఆదోని టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి మంగళ శాసనములతో చిన్నారులకు సర్వరోగ నివారణి అయిన స్వర్ణామృత ప్రాశనం ఔషధాన్ని మంగళవారం పంపిణీ చేయనున్నట్లు ఆవోపా పట్టణ అధ్యక్షుడు శ్రీనాథ్ గుప్త సోమవారం తెలిపారు. వికాస తరంగిణి వారి సహకారంతో 19వ విడతగా స్థానిక అభయ ఆంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో ఆరు నెలల నుండి 16 సంవత్సరాల వయస్సు ఉన్న చిన్నారులకు ఈ ఔషధాన్ని పంపిణీ చేయడం జరుగుతుందని ప్రతి తల్లిదండ్రులు ఈ ఔషధాన్ని తమ చిన్నారులకు అందించాలని కోరారు.

అనువైన ప్రదేశంలో సచివాలయం నిర్మించాలి

ఆలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలం ఎం.కొట్టాల గ్రామంలో సచివాలయం మంజూరు కావడం హర్షనీయమే అయినా అనువైన ప్రదేశంలో నిర్మించాలని దళిత సంఘం సీనియర్ నాయకులు దేవదాసు, బాస్కర్, ప్రసాద్, వెంకటేలు సోమవారం తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, మండల పరిషత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. గతంలో గరుసు కోసం తవ్విన గుంతలో సచివాలయ భవన నిర్మాణం చేపట్టేందుకు అధికారులు నిర్ణయించారన్నారు. అక్కడ కడితే భవనం కూలిపోయే ప్రమాదం ఉందన్నారు.

ఎమ్మిగనూరు

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

ఉరుకుందలో ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న స్వామి

కౌతాళం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో సోమవారం భక్తులతో సందడిగా మారింది. సోమవారం స్వామి వారం కావడంతో దేవాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామునే శుద్ధజలాలతో పూజించి ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. తెలంగాణ, కర్ణాటక నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి ఉచిత అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

శ్రీమఠంలో దాసవాణి సాహిత్యం


సంగీత కచేరి నిర్వహిస్తున్న బెంగుళూరు కళాకారులు

మంత్రాలయం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో బెంగళూరుకు చెందిన కళాకారులు యశ్వంత్ బృందం వారిచే నిర్వహించిన దాసవాణి సాహిత్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. సోమవారం మార్గశిర చవితి శుభసందర్భంగా యాగశాలలో నిర్వహించిన ఆధ్యాత్మిక భక్తి పాటలు అలరించాయి. కార్యక్రమంలో మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్, ఐపీ నరసింహమూర్తి, శ్రీపతి ఆచార్, పద్మనాభ ఆచార్,జయతీర్థ ఆచార్, వ్యాసరాజ ఆచార్ పాల్గొన్నారు.

వైభవంగా రాఘవరాయడి ఊంజల సేవ


రాఘవరాయడికి ఊంజల సేవ చేస్తున్న మఠం దివాన్ శ్రీనివాస ఆచార్, పండితులు

మంత్రాలయం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో అంగరంగా వైభవంగా రాఘవరాయడి ఊంజలసేవ చేశారు. సోమవారం చవితి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో మఠం దివాన్ శ్రీనివాస ఆచార్ రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను యాగశాలలో వెండి ఊయలలో అధిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి పూర్ణబోధ పూజ మందిరంలో మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేసి హారతులు ఇచ్చారు. బంగారు పల్లకిలో అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ అంగరంగా వైభవంగా ఊరేగించారు. భక్తులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శేష వస్త్రం, ఫల,పుష్ప, మంత్రాక్షితలుఇచ్చి ఆశీర్వాదించారు.

ఎమ్మిగనూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రీనివాసులు



ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కె. శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శేషఫణిని జిల్లా అధికారులు కర్నూలుకు బదిలీ చేయడంతో ఎమ్మిగనూరు తహసీల్దార్ పోస్టు ఖాళీ ఏర్పడింది. దీంతో నందవరం తహసీల్దార్‌గా పనిచేస్తున్న కె.శ్రీనివాసులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. రైతులకు, ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

రూరల్ పోలీస్ స్టేషన్ తనిఖీ


రూరల్ పోలీస్ స్టేషన్‌లో రికార్డును పరిశీలిస్తున్న ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి సోమవారం ఎమ్మిగనూరు రూరల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా స్టేషన్‌లో ఉన్న ఫైళ్లు, వివిధ కేసులకు సంబంధించిన సీడీలను పరిశీలించారు. అలాగే కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎమ్మిగనూరు సర్కిల్ పరిధిలో ప్రమాదాలు జరగకుండా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. శాంతిభద్రతలకు ఎక్కడా విఘాతం కలగకుండా చూసుకోవాలన్నారు. ఈ తనిఖీలో రూరల్ సీఐ చిరంజీవి, ట్రైనీ ఎస్ఐ మల్లికార్జున, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈరన్న పాల్గొన్నారు.

17న మంత్రాలయంలో దేవర

● పీఠాధిపతి అనుమతి కోరిన గ్రామ పెద్దలు


మఠం ప్రాంగణంలో గ్రామ పెద్దలు

మంత్రాలయం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో 16,17న దేవర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు పన్నగ వెంకటేశ్వర స్వామి, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, పూజారి వ్యాసరాజాచార్, గోరుకల్లు కృష్ణస్వామి, జనార్దన్‌రెడ్డి, కురువ మల్లికార్జున తెలపారు. సోమవారం రాత్రి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులను పార్టీలకతీతంగా గ్రామ పెద్దలు కలిసి దేవర ఉత్సవాలపై చర్చించారు. 17న దేవర ఎంతో వైభవంగా జరుపుకోవాలని ఆశీస్సులు తెలపారు. అంతేకాకుండా మంత్రాలయంలో ఉన్న దేవాలయాలకు పెయింటింగ్, లైటింగ్, ప్రసాదంతో పాటు అవసరమైన సహకారం శ్రీమఠం నుంచి అందిస్తామని పీఠాధిపతి హామీ ఇచ్చారు. గ్రామంలో ఏ అవసరమున్నా తన దృష్టికి తెస్తే చేయూతనిస్తానని తెలిపారు. దీంతో గ్రామపెద్దలతో పాటు గ్రామస్థులు పీఠాధిపతి చేస్తున్న సేవల పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శాంతప్పఆచారి, తిమ్మయ్య, నర్సప్ప, మేకల వెంకటేష్, డీసీ తిమ్మప్ప, వైఎస్ఎంపీపీ రాఘవేంద్ర, శివరాంగౌడు, ఆడిట్ శంకర్, విశ్వనాథ్ ఆచారి, సుంకప్ప, నరసింహ పాల్గొన్నారు.

నిధులు లేక..
శిక్షణ ఆగమైంది!

● మూతపడిన డీడీయూ-జీకేవై శిక్షణ కేంద్రం
● ఇబ్బందుల్లో యువత ● పట్టించుకోని ప్రభుత్వం


ఎమ్మిగనూరులో మూతపడిన శిక్షణా కేంద్రం

ఎమ్మిగనూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎమ్మిగనూరులో ఏర్పాటు చేసిన డీడీయూ-జీకేవై(దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన) శిక్షణా కేంద్రం నిధులలేమితో గతేడాది ఫిబ్రవరిలో మూతపడింది. దీంతో గ్రామీణ ప్రాంత పేద యువతను ఆర్థికంగా సామర్థ్యాన్ని పెంచేందుకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి వారి అభ్యున్నతికి బాటలు వేయలన్న ప్రభుత్వం లక్ష్యం నీరుగారిపోతోంది. ఏడాదిన్నర కాలం గా శిక్షణా కేంద్రం మూతపడటంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతీయువకులు ప్రైవేటు సంస్థల్లో డబ్బు వెచ్చించి శిక్షణ తీసుకునే స్థోమతలేక ఇబ్బందులు పడుతున్నారు.

● **ఎనిమిదేళ్ల క్రితం ఏర్పాటు:** ఎమ్మిగనూరు పట్టణంలోని వైడబ్ల్యుసీస్ ప్రధాన కార్యాలయం వెనుక ఉన్న భవనంలో డీడీయు-జీకేవై(దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన) శిక్షణ కేంద్రం 2018లో ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కేంద్రంలో నలుగురు సిబ్బందితో పాటు శిక్షణ పొందుతున్న యువతకు హస్టల్ వసతి సైతం కల్పించారు. కరోనా సమయం మినహా మిగత సమయంలో ఐదేళ్ల కాలంలో వందలాది మందికి వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చారు. ప్రధానంగా నైపుణ్య శిక్షణ పథకాల గురించి అవగాహన, ఉచిత నైపుణ్య శిక్షణా కోర్సులు అందించడం, ఉపాధి అవకాశాలను పెంచటానికి అవసరమైన పారిశ్రామిక అవగాహన కల్పించడం వంటి శిక్షణ కార్యాక్రమాలు నిర్వహించారు. దీంతో ఎంతో మంది యువతీ యువకులు ఇక్కడ శిక్షణ పొంది వారి జీవనోపాధిని మెరుగుపరుచుకున్నారు.

● **నిధుల లేమితో:** ఎమ్మిగనూరు పట్టణంలో 2018లో ఏర్పాటు చేసిన డీడీయు - జీకేవైసీ శిక్షణ కేంద్రం దాదాపు ఐదేళ్లకు పైగా ఎలాంటి ఒడిదుడుకులు లేక సాఫీగా సాగింది. అయితే 2024 ఫిబ్రవరిలో వైసీపీ ప్రభుత్వంలో మూత పడింది. శిక్షణ కేంద్రం నిర్వహణకు నిధులు విడుదల కాకపోవడంతో కొత్తగా యువత చేరేందుకు అవకాశం లేక పోయింది. అంతేగాక కేంద్రంలో పనిచేసే సిబ్బందికి సైతం వేతనాలు విడుదల నిలిచిపోయాయి. దీంతో సిబ్బందికి కేంద్రం నిర్వహణ కష్టంగా మారింది. దాదాపు నాలుగు నెలల వేతనాలు కూడా సిబ్బందికి నేటికి అందలేదు. శిక్షణ కేంద్రం నిర్వహణపై ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్లే నిధులు విడుదల నిలిచిపోయాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిక్షణ కేంద్రం తిరిగి తెరుచుకునేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

● శిక్షణా కేంద్రాలపై నిర్లక్ష్యం తగదు



గ్రామీణ యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రం రెండేళ్లుగా మూతపడింది. కేంద్రం మూతపడడంతో ఎంతో మంది గ్రామీణ యువత శిక్షణ తీసుకునేందుకు ప్రైవేటు సస్థలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పండింది. కూటమి ప్రభుత్వం శిక్షణా కేంద్రాన్ని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పునఃప్రారంభించాలి.

- సురేష్ కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

మిరప, వరికి తెగుళ్లు

● పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు


మిరపకు సోకిన అంత్రక్నోజ్ తెగులు


వరికి సోకిన మానిపండు తెగులు

ఎమ్మిగనూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని కె.నాగలాపురం గ్రామంలో మిరప, వరి, మొక్కజొన్న పంటలకు అంత్రక్నోజ్, మానిపండు తెగులు, కత్తెర పురుగు సోకినట్లు వ్యవసాయ అధికారులు ఏడీఏ మహ్మద్‌ఖాద్రీ, ఏవో శివశంకర్‌లు గుర్తించారు. సోమవారం కె.నాగలాపురం గ్రామంలో పర్యటించి రైతులు సాగుచేసిన మొక్కజొన్న, మిరప, వరి పంటలను పరిశీలించారు. ఏడీఏ మహ్మద్ ఖాద్రీ మాట్లాడుతూ మిరప పంటలో కాయలమీద అంత్రక్నోజ్ తెగులు ఆశించడం జరిగిందని, ఈ తెగులు సోకడంతో కాయలమీద చిన్న మచ్చలు ఏర్పడి అవి పెద్దవిగా మారి కాయ మొత్తం తెల్లగా మారుతుందన్నారు. దీని నివారణకు డైఫెన్ కోనాజోల్ అనే మందును ఒక మి.లీ ఒక లీటరులో కలిపుకొని పిచికారి చేయాలన్నారు. అలాగే మిరప పంటలో పొలంచుట్టు ఉన్న పార్టీనీయం గడ్డిని తీసివేయాలని సూచించారు. ఈ గడ్డివల్ల వివిధ వైరస్ తెగులు వస్తుందన్నారు. గడ్డిని తీసి నాశనం చేయాలన్నారు. అలాగే వరి పంట కోత కంకిదశలో ఉందని, ఈ పంటకు మానిపండు తెగులు ఆశించిందన్నారు. దీని నివారణకు ప్రొఫికొనజోల్ ఒక మి.లీ ఒక లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేయాలన్నారు. అలాగే మొక్కజొన్న పంటను కత్తెర పురుగు ఆశించిందని, ఈ పురుగు సుడుల్లో ఉండి అంకురం తినడం వల్ల పెరుగుదల తగ్గుతుందన్నారు. దీని నివారణకు యమామెక్టిన్ బెంజోయేట్ 0.3గ్రాములు ఒక లీటరు నీటిలో కలుపుకొని మొక్కల సుడులలో పడేటట్టు వేసుకోవాలన్నారు. రైతులు పంటలపై సోకే తెగుళ్ల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీరివెంట ఏఈవో నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

కుర్ణి కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మిన్నప్ప


ప్రమాణస్వీకారం చేస్తున్న మిన్నప్ప

ఎమ్మిగనూరు, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): కుర్ణి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌గా ఎమ్మిగనూరుకు చెందిన మిన్నప్ప సోమవారం విజయవాడలోని రాష్ట్ర బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. బీసీ కార్పొరేషన్ హెచ్‌వోడీ మిన్నప్పతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన కుర్ణి కార్పొరేషన్‌కు ఏర్పాటు చేసిన కార్యాలయంలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మిన్నప్ప మాట్లాడుతూ చేనేత కార్మికుల అభివృద్ధి కోసం కీలక బాధ్యతను కల్పించిన కూటమి అధినేత సీఎం చంద్రబాబునాయుడు, స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. చేనేత వర్గ ప్రజల సంక్షేమం వారి ఆర్థిక శ్రేయస్సు కోసం ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వారికి అందజేస్తూ మరింత చురుకుగా పనిచేస్తానన్నారు.కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మాచాని మహేష్, నాయకులు బుగిడె నాగరాజు, మాచాని శివశంకర్, కామూర్తి మహేష్, కటారి రాజేం ద్ర, దేవేంద్ర, నరసింహులు, సలాం, లక్ష్మన్న, ఎంగలి ఈరన్న, కనెకె నాగరాజు, కనెక కృష్ణలు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరావాలి

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కర్నూలులో 12న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణకు బీజేపీ శ్రేణులు తరలిరావాలని బీజేపీ నాయకురాలు, రజక రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ సావిత్రి పిలుపునిచ్చారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ వాజ్‌పేయి దేశానికి ఎన్నో సేవలు అందించారని అన్నారు. కార్యక్రమంలో వెంకటశర్మ, రాజశేఖర్, భాస్కర్, మాధవిలత, నారాయణ, బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి


కోసిగి రైతు సేవా కేంద్రంలో సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో వరప్రసాద్

కోసిగి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. సోమవారం కోసిగిలోని రైతు సేవా కేంద్రంలో రబీ-2025 సీజన్‌కు సంబంధించి వంద శాతం సబ్సిడీపై మినుముల విత్తనాలు, 40 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను రైతులకు అందించారు. ఒక క్వింటం కే-6 వేరుశనగ విత్తనాలు పూర్తి ధర రూ.9,200 కాగా, రూ.3,680లు సబ్సిడీ మినహాయించి ఒక క్వింటానికి రూ.5,520లు రైతులు చెల్లించాల్సి ఉంటుందని, వేరుశనగ విత్తనాలు డిసెంబరు రెండో వారం వరకు విత్తుకున్నట్లయితే మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే రైతుభరోసా కేంద్రాల ద్వారా యూరియా అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది శిరీష, రైతులు పాల్గొన్నారు.

రాజీ మార్గం ద్వారా కేసుల సత్వర పరిష్కారం

ఎమ్మిగనూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ కేసుల సత్వర కేసుల పరిష్కారం కోసం లోక్ అదాలత్‌ను సంప్రదించాలని, రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని మండల లీగల్ సర్వీసు చైర్‌పర్సన్, ఎమ్మిగనూరు జూనియర్ సివిల్‌జడ్జీ హేమ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ కేసులను పోలీసు, న్యాయవాదులు వేసిన వ్యాజ్యాలు ఎమ్మిగనూరు కోర్టుకు సంబంధించి 13.12.2025న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈనెల 13న జరగనున్న కేసుల పరిష్కారంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే న్యాయవాదులు, పార్టీలు పోలీసు అధికారులు కోర్టు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువస్తే తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


దీక్ష చేస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సహకార సంఘాల యూనియన్ అధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఎమ్మినూరు బ్యాంక్ సీఈవో, పీఏసీఎస్ వేణుగోపాల్, కడిమెట్ల బ్యాంక్ సీఈవో, పీఏసీఎస్ దత్తాత్రేయ మాట్లాడుతూ జీవో 36 ప్రకారం పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలు చేసి, అప్పటి వరకు మధ్యంతర భృతి ఇవ్వాలని, గ్రాట్యూటి అమలు చేసి, గ్రాట్యూటి చెల్లించాలని, రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, ఆరోగ్య బీమా, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, 3 సంవత్సరాల నిబంధన కాకుండా నిరవధికంగా బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎమ్మిగనూరు వైసీపీ ఇన్‌చార్జీ రాజీవ్ రెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వీరి వెంట నాయకులు సునీల్, బుట్టా రంగయ్య, ఖాజా హుసేన్, రాజు, లక్ష్మణ పాల్గొన్నారు.

పోరాట ఫలితమే కార్మికుల పిల్లలకు తల్లికి వందనం


ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ అస్లాంకు జీవో కాపీని అందజేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పోరాట ఫలితమే పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల పిల్లలకు తల్లికి వందనం పథకం అమలైందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు నాగరాజు, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 26 కాపిని ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ అస్లాంకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వచ్చే ఏడాది నుంచి పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు అయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కేసన్న, బడేసాబ్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరులు రాజకీయాల్లో రాణించాలి

● సంఘం జిల్లా అధ్యక్షుడు గోనేబావి గోపాల్, కార్యదర్శి వీరేంద్ర


సజ్జలగుడ్డంలో మాట్లాడుతున్న ఉప్పర సంఘం జిల్లా అధ్యక్షుడు గోనేబావి గోపాల్, కార్యదర్శి రవీంద్ర

కోసిగి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సగర ఉప్పర సంఘం కులస్థులు ఆర్థికాభివృద్ధి సాధించి, రాజకీయాల్లో రాణించాలని ఉప్పర సంఘం జిల్లా అధ్యక్షుడు గోనేబావి గోపాల్, కార్యదర్శి వీరేంద్ర పిలుపునిచ్చారు. సోమవారం కోసిగి మండలంలోని సజ్జలగుడ్డం గ్రామంలో ఉప్పర కులస్థులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అన్నీ రాజకీయ పార్టీలు ఉప్పరులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. అనంతరం సజ్జలగుడ్డం గ్రామంలో శ్రీభగీరథ మహర్షి విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. త్వరలోనే గ్రామంలో భగీరథ మహర్షి విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

● **ఉప్పర కులస్థుల గ్రామ నూతన కమిటీ ఎన్నిక:** సజ్జలగుడ్డం గ్రామంలో ఉప్పర కులస్తుల గ్రామ నూతన కమిటిని జిల్లా అధ్యక్షులు గోనేబావి గోపాల్, జిల్లా కార్యదర్శి యూకే వీరేంద్ర ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ గౌరవ అధ్యక్షుడిగా యు.శివానందప్ప, యు.బసవరాజు, గ్రామ అధ్యక్షుడుగా హనుమంతు, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, ట్రెజరర్ నెట్టికంటయ్యతో పాటు కమిటీసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో తప్పులు లేకుండ చూసుకోవాలని ఎమ్మిగనూరు ఇన్‌చార్జి తహసీల్దార్ కె.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో బీఎల్‌వోల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రోగ్రెస్‌ను మరింత పెంచాలన్నారు. కొత్త ఓటరు జాబితా, పాత ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎక్కడ ఎలాంటి తప్పులు జరగకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల అధికారి వలి, వీఆర్వోలు, ఆయా గ్రామాల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

షేర్ హోల్డర్లకు న్యాయం చేయాలి


దీక్షకు సంఘీభావం తెలుపుతున్న పూలే అంబేడ్కర్ సొసైటీ రాష్ట్ర గౌరవ సలహాదారులు, పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గణేశ్


ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : షేర్ హోల్డర్ల కుటుంబాలకు న్యాయం చేయాలని పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డా. గణేశ్ డిమాండ్ చేశారు. సొసైటీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో 6వ రోజు షేర్ హోల్డర్లు రిలే నిరాహార దీక్షలో కొనసాగించారు. సోమప్ప సర్కిల్‌లో రిలే నిరాహార దీక్షకు మద్దతుగా వారు మాట్లాడుతూ గత 70 ఏళ్లుగా కలగట్ల రోడ్డులో లెదర్ సొసైటీని దళితుల కోసం ఏర్పాటు చేసి వారి చేతి వృత్తులను చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా, ఇప్పుడు వారిని కాదని ప్రైవేట్ వ్యక్తులను షేర్ హోల్డర్లుగా తీసుకొని సొసైటీ చైర్మన్ మోసం చేయడం సమంజసం కాదన్నారు. దీక్షలో పాల్గొన్న షేరు హోల్డర్లు సభ్యులు ఆనందు, రామయ్య, శాంసన్, నాగరాజులు దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శాంసన్, ఆశోక్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి: ఎస్టీయూ


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం అడివన్న అధ్యక్షతన ఎస్టీయూ తాలుకా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 19నెలలు అయినప్పటికీ 12వ పీఆర్సీ కమిటీ ఏర్పాటు గానీ, మధ్యంతర భృతి, ఆర్థిక బకాయిల విడుదల, పెన్షన్‌ల ఇలా ఏ ఒక్క విషయంలో కూడా స్పష్టత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నూతన జిల్లా ప్రధాన కార్యదగా ఎన్నికైన సుంకన్నను ఎస్టీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, బసవరాజు, ప్రసన్న, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్, విత్తన బిల్లును రద్దు చేయాలి


సూగూరులో విద్యుత్, విత్తన బిల్లుపై నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

మంత్రాలయం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న విద్యుత్, విత్తన బిల్లుతో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. సోమవారం సూగూరు గ్రామంలో సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఏఐకేఎస్ ఆధ్వర్యంలో బిల్లులకు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్, విత్తన బిల్లులు నరేంద్రమోదీ ప్రవేశ పెడతున్న బిల్లుల వల్ల పేదరైతులకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. బిల్లుల ప్రతులను దహనం చేశారు. బిల్లులు వెంటనే ఆపాలని లేని పక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు యోగప్ప, నాయకులు, కాశీం, బ్రహ్మయ్య, నాగేష్, తిక్కన్న, మల్లప్ప, బాలగడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

మంత్రాలయం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలడోణ పాఠశాలను ఎంఈవో రాఘన్న తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూప్రకారం, నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తనిఖీలో హెచ్ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.